ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
శుక్రవారం 29 మార్చి 2024



ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 39.0
కనిష్ఠం : 24.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:25 (శుక్ర)
సహారి : 4:39 (శని)

## ఎన్నికల ప్రచారానికి తరలిరండి



**▸▸ డ్వాక్రా మహిళలకు వలంటీరు పిలుపు.. సీ-విజిల్‌లో ఫిర్యాదు**

పెనుమంట్ర, మార్చి 28 : 'ఆచంట సిట్టింగ్ ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి రంగనాథరాజు ప్రచారానికి వస్తున్నందున పది మంది డ్వాక్రా మహిళలు తప్పనిసరిగా హాజరు కావాలని రామలక్ష్మి అక్క చెప్పింది. ఈ సమాచారం మీకు అందిస్తున్నా. ప్రచారానికి వచ్చే డ్వాక్రా మహిళలు ప్రతి ఒక్కరు రేషన్ కార్డు ఒరిజినల్, ఆధార్ కార్డు, ఫొటోలు, బ్యాంకు అకౌంట్ ఒరిజనల్స్ తప్పనిసరిగా తీసుకురావాలి. ప్రచారం అనంతరం సర్పంచ్ నాగరాజు ఇంటి వద్ద భోజనాలు కూడా ఉన్నాయి. వాయిస్ విన్న వారంతా రెస్పాండ్ కావాలి' అని పెనుమంట్ర మండలం గరువుకు చెందిన ఒక గ్రామ వలంటీరు వాయిస్ మెసేజ్ డ్వాక్రా వాట్సాప్ గ్రూపుల్లో ఫార్వర్డ్ కావడం కలకలం రేపింది. వలంటీర్లు ప్రచారాలకు, పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని జిల్లా అధికారులు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా వారు వాటిని బేఖాతరు చేస్తున్నారనడానికి ఇదే నిదర్శనం. ఈ మెసేజ్‌పై పలువురు సీ-విజిల్‌లో ఎన్నికల అధికారులకు ఫిర్యాదుచేశారు. దీనిపై స్పందించిన నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ స్వామినాయుడు విచారణకు ఆదేశించారు. పెనుమంట్ర తహసీల్దార్ లక్ష్మీకల్యాణి, ఎంపీడీవో పద్మజ, గ్రామ కార్యదర్శులు, వలంటీరును విచారించారు. ఈ క్రమంలో గ్రామంలో జరగాల్సిన ఎన్నికల ప్రచారం అర్ధంతరంగా రద్దు చేసుకున్నట్లు తెలుస్తోంది.

## ఆ డబ్బులు ఎవరిస్తారు ?

**▸▸ కోడ్ అమలు.. కార్యదర్శులకు వదులుతున్న చేతిచమురు**

ఏలూరు రూరల్, మార్చి 28 : గ్రామ పంచాయతీల కార్యదర్శులకు ఎన్నికల కోడ్ కొత్త కష్టాలు తెచ్చి పెట్టింది. నిబంధనలు అమలు చేసే క్రమంలో చేతిచమురు వదులుతోంది. గ్రామాల్లో రాజకీయ పార్టీల రంగులు, స్టిక్కర్ల తొలగింపుపై ఆర్వోలు ఆదేశాలు ఇస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చెట్టు, పుట్ట, గోడ ఏది వదలకుండా తమ పార్టీ రంగులతో నింపేసింది. ఆర్బీకే, సచివాలయాలు, ఓటర్ హెడ్ ట్యాంక్‌లు, విద్యుత్ స్తంభాలకు వైసీపీని పోలిన రంగులు, ప్రతి ఇంటికి జగన్ చిత్రాలతో ఉన్న స్టిక్కర్లు ప్రధాన రహదారులపై ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించాల్సి వచ్చింది. అయితే ఈ తొలగింపులకు సంబంధించి ఎటువంటి నిధులు పంచాయతీలకు కేటాయించడంలేదు. స్టిక్కర్లు తొలగింపుతోపాటు రంగులు మార్చేందుకు పంచాయతీ కార్యదర్శులకు రూ.ఐదు వేలకుపైనే ఖర్చవుతోంది. ఉన్నతాధికారుల ఆదేశాలను ధిక్కరించ లేక చేసేది లేక కొంత మంది తలలు పట్టుకుంటున్నారు. ఇంకొందరు అప్పులు చేసి మరీ తొలగింపు చర్యలు చేపట్టారు. ఖర్చుల విషయంపై కొన్నిచోట్ల మండల అధికారులు, కార్యదర్శులకు వాగ్వాదం జరుగుతోంది.



## ఎవరు గెలుస్తారో ?

**▸▸ గ్రామాల్లో ప్రైవేట్ సర్వేల జోరు**

నరసాపురం, మార్చి 28 : ఇంకా నామినేషన్ల ఘట్టం ప్రారంభం కాలేదు. అప్పుడే గెలుపు ఎవరిదంటూ సర్వేలు జోరందుకున్నాయి. పలు సంస్థల సభ్యులు గ్రామాలు, వార్డుల్లో పర్యటిస్తూ ప్రజానాడి తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. యువత దగ్గర నుంచి వృద్ధుల వరకు కులాల వారిగా అభిప్రాయాలను సేకరిస్తున్నారు. తెలుగు రాష్ట్రాలతోపాటు ఉత్తరాదికి చెందిన ఏజెన్సీలు రంగంలోకి దిగాయి. అనేక ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుని క్షుణ్ణంగా సర్వే చేస్తున్నారు. ఓ వైపు అభ్యర్థుల ప్రచారం, మరోవైపు సర్వేలకు దిగడంతో ప్రజలు ఇప్పటి నుంచే ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కొందరు ఏమి చెప్పకుండా దాటేస్తుంటే.. మరికొందరు వారి అభిప్రాయాలను బల్లగుద్ది మరీ వెల్లడిస్తున్నారు. గతంలో గ్రామాలు, పట్టణ శివారు ప్రాంతాల్లోనే సర్వేలు జరిగేవి. అయితే ఈసారి మారుమూల గ్రామాలకు వెళ్లి అభిప్రాయాలను తెలుసుకోవడం గమనార్హం.



భీమవరం వచ్చిన ఎంపీ రఘురామ

## కూటమి అభ్యర్థిగా ఉంటా : ఎంపీ రఘురామ

భీమవరం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): నరసాపురం నుంచే మూడు పార్టీల కూటమి ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తానన్న విశ్వాసం తనకు ఉందని ఎంపీ రఘురామకృష్ణంరాజు ధీమా వ్యక్తం చేశారు. గురువారం భీమవరం విచ్చేసిన ఆయన విలేఖరులతో మాట్లాడారు. 'ఎన్నికల్లో జగన్‌ను ఓడించాలన్న ప్రతి ఒక్కరూ తాను నరసాపురం నుంచి ఎంపీ కూటమి అభ్యర్థిగా పోటీ చేయాలని కోరుకున్నారు. నేనూ అదే ధీమాతో ఉన్నాను. లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని జగన్ ప్రయత్నించినప్పుడు కేంద్ర ప్రభుత్వం కాపాడుతూ వచ్చింది. తాను అరెస్టయినప్పుడు చంద్రబాబు పూర్తిగా సహకరించారు. కేంద్ర బీజేపీ నాయకత్వంతో మంచి సంబంధాలున్నా.. రాష్ట్ర నాయకత్వంతో అంతగా లేవు. ఇప్పటి వరకు సీఎం జగన్ తనపై వున్న కేసులకు సంబంధించి మూడు వేల వాయిదాలు తీసుకున్నారు. అన్ని వాయిదాలు తీసుకుంటే బెయిల్ రద్దవుతుంది. బెయిల్ రద్దుపై ఒకటి, త్వరితగతిన కేసుల విచారణ పూర్తి చేయాలని మరో కేసు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశా. ఏప్రిల్ 1న బెయిల్ రద్దు పిటిషన్ విచారణకు రానుంది' అని చెప్పారు.

## తొలగించబడ్డ ఉద్యోగులపై కేసు

ఏలూరు క్రైం, మార్చి 28 : ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని క్యాంపు కార్యాలయంలో ఎన్నికల కార్యకలాపాల్లో పాల్గొన్న ఏలూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం చేస్తున్న ఇద్దరు ఉద్యోగులను ఇప్పటికే తొలగించగా తాజాగా వారిపై కేసు నమోదు చేశారు. ఏలూరు నగర కార్పొరేషన్‌లో పబ్లిక్ హెల్త్ విభాగంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేస్తున్న ఎండీ ఇబ్రహీంఖాన్, మోహన్‌కుమార్ ఈనెల 20న ఏలూరు శ్రీరామ్‌నగర్ 9వ రోడ్డులో ఉన్న ఆళ్ల నాని క్యాంపు కార్యాలయంలో ఎన్నికల కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ ఘటనపై ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌తో విచారణ జరిపించగా వాస్తవమని నిర్ధారణ కావడంతో ఉద్యోగాల నుంచి తొలగించారు. ఇన్‌చార్జి కమిషనర్ చంద్రయ్య గురువారం త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ వెంకటేశ్వరరావు వారిద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# రాష్ట్రంలో యువతకు ఏదీ ఉపాధి

**బాబుతోనే జాబు గ్యారెంటీ**

## ఐదేళ్లలో ఒక్క పరిశ్రమ రాలేదు

**▸▸ వైసీపీ ప్రభుత్వ తీరుపై నారా భువనేశ్వరి ఆగ్రహం**

**▸▸ చంద్రబాబును సీఎంను చేస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం**

**▸▸ మూడో రోజు 'నిజం గెలవాలి'.. బాధితులకు పరామర్శ**

నూజివీడు టౌన్/ఆగిరిపల్లి, మార్చి 28 : 'రాష్ట్రంలో ఒక్క పరిశ్రమ రాలేదు. చదువుకు తగ్గ ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఏ ఒక్కరికి లభించలేదు. ఏం మంచిపని చేశారో ఈ రాష్ట్ర ముఖ్యమంత్రికి తెలియదు. గంజాయి, డ్రగ్స్, ఇసుక మాఫియా, భూకబ్జాలతో రాష్ట్రాన్ని దోచుకుంటున్న వారు తమను ప్రశ్నించే వారిని దొంగలుగా చిత్రీకరించేందుకు ప్రయత్నిస్తున్నారు. బాబుతోనే జాబు గ్యారెంటీ లభిస్తుంది' అని వైసీపీ ప్రభుత్వ తీరుపై టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరి అన్నారు. 'నిజం గెలవాలి' పేరిట జిల్లాలో చేపట్టిన యాత్ర గురువారం మూడో రోజుకు చేరింది. ఆగిరిపల్లి మండలం తోటపల్లికి చెందిన బెజవాడ రామారావు, ఆగిరిపల్లిలో కలవకొల్లు శ్రీరాములమ్మ, పలగాని చంద్రయ్య, నూజివీడు మండలం గొల్లపల్లిలో వెనిగళ్ళ పూర్ణచంద్రరావు కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి టీడీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'వైసీపీ పాలనలో మహిళలకు రక్షణ కరువైంది. చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గంలో హంసవేణి అనే మహిళ నీరు కావాలన్నందుకు ఆమె రెండు కళ్లను వైసీపీ కిరాతకులు పీకేశారు. పోషించే వారు ఎవరూ లేక నేడు ఆ కుటుంబం అనాథ అయ్యింది. ఆడబిడ్డలకు రక్షణ కావాలంటే చంద్రబాబును తిరిగి సీఎంను చేయాలి. నిరంతరం మహిళ రక్షణ, రాష్ట్ర ప్రజల అభివృద్ధిని కాంక్షించే చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేసి జైలుకు పంపించినప్పుడు అవినీతి రూ.325 కోట్లని అన్నారు. తర్వాత రూ.27 కోట్లు జరిగిందన్నారు. ఆయన అవినీతి చేసే వ్యక్తే అయితే 14 ఏళ్లలో లక్షల కోట్లు సంపాదించేవారు. ఆయన నిర్మించిన అమరావతిని వైసీపీ ప్రభుత్వం ధ్వంసం చేసింది. మూడు రాజధానులని చెప్పి ఒక్కటి కూడా లేకుండా చేసింది. అమరావతికి భూములిచ్చిన రైతులపై కర్కశంగా వ్యవహరించింది. అమరావతి రైతులను పోలీసులతో కొట్టించారు. అయినా వారు ఎక్కడా వెనక్కి తగ్గకుండా 1,600 రోజులుగా పోరాటాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు.

చంద్రబాబును నిర్బంధంలో ఉంచిన కాలంలో రాష్ట్రవ్యాప్తంగా 206 మంది పార్టీ కార్య కర్తలు ఆందోళనకు గురై ఆకస్మిక మరణం పొందారు. వీరికి రక్షణ భరోసా కల్పించడం, తెలుగుదేశం కుటుంబ సభ్యులుగా వారికి అండగా నిలవడం బాధ్యతగా భావించి 'నిజం గెలవాలి' కార్యక్రమంతో ముందడుగు వేశాను. ఇది ప్రారంభించిన సమయంలో కొంత భయమేసింది. నిబద్ధత కలిగిన పార్టీ కార్యకర్తలైన నా బిడ్డలు ముందూ వెనుక ఉండి అమ్మా ముందడుగు వేయండి అంటూ నిజం గెలవాలి కార్యక్రమాన్ని ముందుకు సాగేలా చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏనాడు నేను కార్య కర్తలను కలవలేదు. ఒకవిధంగా ఇలా జరగడం నా అదృష్టమేమో, కార్యకర్తలను కలిసి అమ్మగా, బిడ్డల మంచి చెడ్డలను తెలుసుకోగలుగుతున్నాను' అంటూ భావోద్వేగంగా మాట్లాడారు. లక్షలాది మంది వున్న టీడీపీని కుటుంబాన్ని స్థాపించింది ఎన్టీఆర్ అయితే పార్టీని దిగ్విజయంగా ముందుకు నడుపుతోంది చంద్రబాబు. మరి భవిష్య త్తులో పార్టీని ముందుకు నడిపేది ఎవరంటూ భువనేశ్వరి కార్యకర్తలను ప్రశ్నించారు. దానికి స్పందనగా జై లోకేశ్ అంటూ కార్యకర్తల నుంచి స్పందన రావడంతో లోకేశ్ ఒక్కడే కాదు అతనితోపాటు లక్షల మంది టీడీపీ కార్యకర్తలైన నా బిడ్డలే పార్టీకి సారథులంటూ ఉద్వేగభరితంగా చెప్పారు. ఒక కుటుంబం అభివృద్ధి చెందాలంటే ఆ కుటుంబానికి పెద్ద దిక్కు ఎంత అవసరమో ఏపీ అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు సీఎం స్థానంలో కూర్చోవడం అంతే అవసరం. మహిళా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను ప్రకటించారు. అధికారంలోకి వచ్చాక వాటిని తప్పకుండా అమలు చేస్తారు. దొంగల పాలనను అంతం చేయాలంటే రాష్ట్రంలో పౌరులందరూ తమ ఓటు హక్కు తప్పనిసరిగా వినియోగించుకోవాలి. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలంటూ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, నూజివీడు తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్, ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి, ఎమ్మెల్సీ అనురాధ, మాజీ ఏఎంసీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు, నూజివీడు నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకుడు నూతక్కి వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.



నూజివీడు మండలం గొల్లపల్లి, ఆగిరిపల్లిలలో పూర్ణచంద్రరావు, శ్రీరాములమ్మ కుటుంబ సభ్యులకు నారా భువనేశ్వరి పరామర్శ





బీజేపీ సమావేశంలో మాట్లాడుతున్న పురందేశ్వరి

## జెండాలు వేరైనా అజెండా ఒక్కటే

**▸▸ అవినీతి, నిరంకుశ వైసీపీ పాలనకు చరమగీతం పాడాలి**

**▸▸ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి**

తణుకు, మార్చి 28 : బీజేపీ-టీడీపీ-జనసేన పొత్తులో జెండాలు వేరైనా అవినీతి, నిరంకుశ, అరాచక వైసీపీ పాలనకు చరమగీతం పాడే అజెండా ఒక్కటేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. నరసాపురం లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల సన్నాహక సమావేశం గురువారం తణుకులో జరిగింది. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. 'రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయింది. విధ్వంసకర, అవినీతి పాలన జరుగుతోంది. మహిళలకు రక్షణ లేదు. యువతకు ఉద్యోగాలు, ఉపాధి లేదు. అన్నింటా జగన్ సర్కార్ విఫలమైంది. ప్రజలంతా ఈ పాలనకు చమరగీతం పాడాలని చూస్తున్నారు. కూటమి చరిత్రాత్మకమైన ఘట్టమే కాకుండా అవసరమని అంతా భావిస్తున్నారు. కేంద్రంలో మోదీ దృఢ నిర్ణయాలు తీసుకుంటూ సుస్థిరమైన, అవినీతి రహిత పాలనను దేశానికి అందిస్తున్నారు. 370 ఎంపీ సీట్లు గెలవాలని బీజేపీ లక్ష్యంగా పెట్టుకుంది. పొత్తులో భాగంగా నరసాపురం పార్లమెంటు స్థానానికి భూపతిరాజు శ్రీనివాస వర్మను అభ్యర్థిగా ఎంపిక చేశాం. ఆయనను గెలిపించుకోవాలి' అని కోరారు. ఎంపీ ఎన్నికల సహ ఇన్‌చార్జి సిద్ధార్థనాథ్ సింగ్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, సాగి విశ్వనాథరాజు, క్రమశిక్షణ సంఘం చైర్మన్ పాకా వెంకట సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ, కొవ్వూరి వెంకటరెడ్డి, పోలేపల్లి వెంకట ప్రసాద్, ముళ్ళపూడి రేణుక తదితరులు హాజరయ్యారు.

# మా మాటే చెల్లాలి

తమ మాట చెల్లుబాటు కావడం లేదని ఒకరిద్దరు అలుగుతారు. ఇంకొందరేమో రాజీనామా చేస్తున్నట్టు సోషల్ మీడియాలో లీక్‌లిస్తారు. ఇంకొందరేమో అంతా మా డైరెక్షన్‌లోనే జరగాలని గీత గీస్తారు. గ్రూపులు కట్టి... గ్రూప్ ఫొటోలు దిగుతారా అంటూ ఇంకొందరు నేతలు మొహం చాటేస్తారు... ఇదంతా చింతలపూడి వైసీపీలో రోజువారీ సీన్. అది కాస్తా ముదిరి గురువారం ఎంపీ కోటగిరి సమక్షంలో పంచాయితీకి దారితీసింది. ఆళ్ళ నాని ఇంట కూడా ఇదే సీన్ సాగింది.

- ఏలూరు - ఆంధ్రజ్యోతి ప్రతినిధి

### ఫ్యాన్ కింద సెగలు.. పొగలు

అధికార వైసీపీలో చింతలపూడి నియోజకవర్గంలో తరచు తగాదాలు ఆ పార్టీలో కొత్త తలనొప్పులు సృష్టిస్తున్నాయి. పార్టీ అభ్యర్థి కంభం విజయరాజు తాము చెప్పినట్టుగానే నడుచుకోవాలని దీనికి విరుద్ధంగా మరెవరితోనూ అంటకాగకూడదని కొందరు సీనియర్లు మోకాలడ్డుతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే ఎలీజాను కాదని విజయరాజును అభ్యర్థిగా ఎంపిక చేశారు. అప్పటి నుంచి ఏదో రూపంలో వివాదం చెలరేగుతూనే వచ్చింది. ఎలీజా కొన్నాళ్లు తీవ్ర అసంతృప్తి, అసహనంతో వైసీపీ చేష్టలను నిలువరించే ప్రయత్నం చేశారు. తనను కాదని పోటీ చేసే అభ్యర్థి చేతే శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయించడం ఏమిటని విరుచుకు పడ్డారు. ఎమ్మెల్యేగా తానున్నానన్న విషయం మరిచి అలా ఎలా వ్యవహరిస్తారంటూ నిగ్గదీశారు. దీంతో వైసీపీ నేతలు దిగివచ్చి ఈ తరహా కార్యక్రమాలకు దూరంగా జరిగారు. ఇదే తరుణంలో ఎలీజా బదులుగా అభ్యర్థిగా రంగంలో వున్న విజయరాజు తాము చెప్పినట్లే వ్యవహరించాలని కొందరు ఆది నుంచి పట్టుబడుతున్నట్టు ఆ పార్టీ వర్గాలే చర్చిస్తున్నాయి.

## చింతలపూడిలో గ్రూప్ ఫొటో వివాదం


**▸▸ వైసీపీలో రాజీనామా బెదిరింపులు**

**▸▸ ఏలూరుకు చేరిన పంచాయితీ**

చింతలపూడికి చెందిన ఒక సీనియర్ నేత నా మాటే చెల్లాలని, లేకుంటే నీకే నష్టం అంటూ వార్నింగ్ ఇచ్చినట్టు ఈ వర్గాల్లో నానుతోంది. దీనికి తగ్గట్టుగానే గురువారం సోషల్ మీడియాలో పుంఖానుపుంఖాలుగా పార్టీ సీనియర్ నేత అశోక్ రాజీనామా చేసినట్టు ప్రచారం జరిగింది. ఇంకేముంది ఆయన రాజీనామాతో అల్లకల్లోల పరిస్థితులు నెలకొంటాయని ఇంకొందరు బాకా ఊదారు. వైసీపీలోని కొందరు ఈ మధ్యనే పార్టీలో ఒక పెద్దాయన దగ్గరకు వెళ్లి గ్రూప్ ఫొటో దిగారు. ఇది కాస్తా నచ్చని అశోక్ ఎవరంతట వారుగా ఇష్టానుసారం ఎలా ప్రవర్తిస్తారంటూ నొచ్చుకున్నారు. ఆయన రాజీనామా చేస్తున్నట్టుగా కొందరు పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. ఏకంగా పార్టీకి రాజీనామా చేయడమే కాదు.. ఏ పార్టీకి వెళ్తారో ప్రచారం సాగింది. అశోక్ రాజీనామా వదంతులతో వైసీపీలో చింతలపూడి రాజకీయాలు వేడెక్కాయి. ఆ వెంటనే సీనియర్లంతా అసలేం జరిగిందంటూ పొద్దుట నుంచి రాత్రి పొద్దుపోయే వరకు ఆరా తీస్తూనే వచ్చారు. సొసైటీ చైర్మన్లు , పార్టీ అనుకూలురు అటూ ఇటూ మారిపోతున్నారంటూ గందరగోళం సృష్టించినట్టు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది.

### తగ్గండి... మాట వినండి

పార్టీలో అంతర్గతంగా చర్చించుకోవాల్సిన విషయాలను రోడ్డుమీదకు తీసుకురావడం ఏమాత్రం ఇష్టం లేని సీనియర్లు, జగన్ దూతలు తక్షణం స్పందించారు. రాజీనామా చేస్తున్నట్టు జరిగిన ప్రచారాన్ని ధ్రువీకరించుకోవాలని, అదేలోపు అశోక్‌తో పాటు మిగతా నేతలను పిలిపించి మాట్లాడాలని ఆదేశాలందాయి. దీంతో మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ళ నాని తొలుత స్పందించి చింతలపూడి నేతలను ఏలూరుకు రప్పించి చర్చించారు. ఇది చాలదన్నట్లుగా సాయంత్రం ఎంపీ కోటగిరి శ్రీధర్ నివాసంలోని ఇదే విషయంలో సుదీర్ఘ మంతనాలు జరిగాయి. మాటవరసకు అనే విషయాలను సీరియస్‌గా తీసుకోకూడదని, రాజీనామా అస్త్రాలు సంధిస్తామని, పరోక్ష సంకేతాలివ్వడం ఏమాత్రం తగదని, అంతా కలిసి మెలసి నడవాల్సిందేనని చిన్నపాటి క్లాస్ పీకినట్లు చెబుతున్నారు. నియోజక వర్గానికి చెందిన కొందరు నేతలు ఏలూరులో జరిగిన సమావేశానికి హాజరయ్యారు.



### ఎలీజా ఏం చేయబోతున్నారు..

ఒకవైపు వైసీపీలోని అంతర్గత తగాదాలు కొనసాగుతూనే ఉండగా, మరోవైపు ఇదే పార్టీ నుంచి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరిన సిట్టింగ్ ఎమ్మెల్యే ఎలీజా ఏం చేయబోతున్నారన్న దానిపై చిలువలు పలువలుగా ప్రచారం సాగుతోంది. కాంగ్రెస్ పక్షాన ఆయన ఎన్నికల బరిలో ఉంటారని కొందరు, ఈ ఐదేళ్ల పాటు ఆయనకు సన్నిహితులుగా ఉన్న కొందరు వైసీపీ విజయావకాశాలను అడ్డుకునేలా కీలకంగా వ్యవహ రిస్తారని సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరుగుతోంది. ఎమ్మెల్యే ఎలీజా తనను అవమానించిన వైసీపీ పై మండిపడుతున్నారు. సాధ్యాసాధ్యాలను అంచనా వేసి తొలుత తెలుగుదేశంలో చేరాలని ఆయన భావించినట్టు టీడీపీ వర్గాలే లీకేజీలిచ్చాయి. చాన్నాళ్ల పాటు ఎమ్మెల్యే ఏ పార్టీలో చేరతారనేదానిపై తర్జనభర్జన సాగింది. కానీ తాజాగా కాంగ్రెస్ పక్షాన పోటీకి దిగుతారనే ప్రచారం జరుగుతుండడంతో ఒక వేళ ఇదే నిజమైతే వైసీపీ ఓటు బ్యాంకు చాలాచోట్ల గండి పడుతుందని ఇంకొందరు అంచనా వేస్తున్నారు. రిజర్వుడు నియోజకవర్గమైన చింతలపూడి రాజకీయాలు ఆది నుంచి కొందరి చేతుల్లోనే కొనసాగడం ఇప్పుడు కూడా అలాంటి పరిస్థితినే అధికార వైసీపీ అభ్యర్థే స్వయంగా ఎదుర్కోవడం సరికొత్త రాజకీయ పరిణామం.

**■ ఆంధ్రజ్యోతితో ఆఫీసర్**

## పూర్తి నిఘా ఉంచాం..

**నూజివీడు ఆర్వో భవానిశంకరి**



- నూజివీడు నియోజకవర్గంలో ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు సకల ఏర్పాట్లు చేస్తున్నాం. నూజివీడు నియోజకవర్గం నూజివీడు, ముసునూరు, చాట్రాయి, ఆగిరిపల్లి, మండలాలతో పాటు నూజివీడు మున్సిపల్ ప్రాంతం కలిసి ఉంది.మొత్తం 286 పోలింగ్ స్టేషన్‌లతో 2,37,139మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,17,398 మంది పురుషులు కాగా 1,19,730మంది మహిళా ఓటర్లు, మరో 11మంది ఇతరులు ఉన్నారు.
- నియోజకవర్గంలో 3,848 మంది 80 ఏళ్లు నిండిన వారు ఓటర్లుగా ఉన్నారు. వీరిలో నడవలేని స్థితిలో ఎంతమంది ఉన్నారో పరిశీలించి ఓటుహక్కు ఇంటివద్దే ఉపయోగించుకునేలా చర్యలు చేపడుతున్నాం.
- కోడ్ ఉల్లంఘన పై నూజివీడు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేకంగా హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశాం. ఉల్లంఘనలు ఏమైనా ఉంటే 08656-232717 నెంబర్‌కు సమాచారం ఇవ్వవచ్చు. సి-విజిల్ యాప్‌లోనూ అప్‌లోడ్ చేయవచ్చు.
- నూజివీడు నియోజకవర్గ వ్యాప్తంగా 25 వేల నూతన ఓటర్ కార్డులు ప్రింట్‌చేసి తపాలాశాఖ ద్వారా ఓటర్లకు అందించే ఏర్పాట్లు చేశాం. ఓటర్‌కార్డు అందని పక్షంలో ఓటుకార్డు నెంబర్‌తో పాటు ఎన్నికల కమిషన్ గుర్తించిన 12 రకాల కార్డుల్లో ఏదైనా ఒకటి తీసుకొచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు.
- 24 గంటలు మోనటరింగ్ చేసేలా ఆరుటీమ్‌లతో నిరంతర పరిశీలన జరుగుతోంది. తెలంగాణ సరిహద్దులో రెండు చెక్ పోస్టులు ఏర్పాటు చేసి నిఘా కొనసాగిస్తున్నాం.

- నూజివీడు

## టెన్త్ పరీక్షలకు 180 మంది గైర్హాజరు

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 28 : పదో తరగతి పరీక్షల్లో భాగంగా గురువారం జరిగిన కాంపోజిట్ సంస్కృతం, ఓఎస్ఎస్‌సీ ఫస్ట్ లాంగ్వేజి పేపర్-1 పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా ముగిసినట్టు డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. రెగ్యులర్ విభాగంలో 4,102 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 3,948 మంది, ప్రైవేటు విభాగంలో 39 మంది విద్యార్థులకు 13 మంది హాజరయ్యారు. జిల్లాలో ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదు.

## చెక్‌పోస్టుల వద్ద 24 గంటలు తనిఖీలు : ఎస్పీ



ఏలూరు క్రైం, మార్చి 28 : రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఒక రాష్ట్రం నుంచి వేరే రాష్ట్రాలకు, ప్రాంతాలకు గంజాయి, సారా, మద్యం అక్రమ రవాణాను అరికట్టాలని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ తెలంగాణా సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న పోలీస్ అధికారులతో గురువారం ఏలూరు పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అంతర్ రాష్ట్ర, అంతర్ జిల్లాల చెక్ పోస్టుల వద్ద 24 గంటలు తనిఖీలు నిర్వహించాలన్నారు. సమాచారాన్ని మార్పిడి చేసుకునే అంశాలపై అధికారులు సహకరించుకోవాలన్నారు. జంగారెడ్డి గూడెం డీఎస్పీ రవిచంద్ర, పోలవరం డీఎస్పీ ఆర్.సతీష్ కుమార్‌రెడ్డి, నూజివీడు డీఎస్పీ లక్ష్మ య్య, సత్తుపల్లి ఏసీపీ ఎ.రఘు, చింతలపూడి సీఐ సుధా కర్, జంగారెడ్డిగూడెం సీఐ రాజేష్, నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ, సత్తుపల్లి సీఐ, అశ్వారావుపేట సీఐ, చాట్రాయి, దమ్మపేట, అశ్వారావుపేట, చింతలపూడి ఎస్ఐలు పాల్గొన్నారు.

## కౌంటింగ్ సెంటర్లు, స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన

సార్వత్రిక ఎన్నికల అనంతరం ఓట్ల లెక్కింపు కోసం ఏర్పాటు చేసి ఏలూరు సర్ సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఉన్న రూమ్‌లను ఎస్పీ మేరీ ప్రశాంతి గురువారం సాయంత్రం పరిశీలించారు. కౌంటింగ్ సెంటర్లు, స్ట్రాంగ్ రూమ్‌లను కళాశాలల్లో ఏర్పాటు చేయగా అక్కడ మౌలిక సదుపాయాలు, అక్కడ భద్రతా పరమైన అంశాలను ఎస్పీ స్వయంగా పరిశీలించారు. స్పెషల్ బ్రాంచ్ సీఐ మల్లేశ్వరరావు, త్రీటౌన్ సీఐ వెంకటేశ్వరరావు, ట్రాఫిక్ సీఐ కాగిత శ్రీనివాసరావు, వన్‌టౌన్ ఎస్ఐ లక్ష్మణబాబు ఉన్నారు.



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో ఆచార్యులు

## గేట్‌లో నిట్ విద్యార్థులకు జాతీయ స్థాయి ర్యాంకులు

తాడేపల్లిగూడెం అర్బన్, మార్చి 28 : గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్ 2024) పరీక్షా ఫలితాలలో ఏపీ నిట్ విద్యార్థులు అద్భుత ప్రతిభను కనపర్చి జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించినట్లు సంస్థ గేట్ ఉచిత శిక్షణ సమన్వయకర్త డాక్టర్ వినోద్ కుమార్‌రాజా తెలిపారు.బీటెక్ చదువుతున్న జయంత్ హరిదాస్ పిశాల్ (బయోటెక్నాలజీ) 20వ ర్యాంకు, పూజారి కేశవ సుబ్రహ్మణం (ఎలక్ట్రికల్) 32వ ర్యాంకు, పెద్ది సిద్దార్థ (కెమికల్) 45, రామిరెడ్డి వెంకటసాయిరెడ్డి (బయోటెక్నాలజీ) 59, రుషినాథ్ (ఎంఎంఈ) 100, అభిరామ్‌కల్లూరి (కెమికల్) 103, ఆదిరాజు ఆదిత్య రామమోహన్ (సీఎస్ఈ) 135, శశాంక్ (బయోటెక్నాలజీ) 149, ఆరిఫ్ (ఎంఎంఈ) 154, బీజీవన్‌సంజయ్ (బయోటెక్నాలజీ) 177, మల్లా రామ్ కుమార్ (కెమికల్) 351 తదితరులు జాతీయ స్థాయి ర్యాంకులు సాధించారన్నారు. వందలోపు ర్యాంకులను ఐదుగురు సాధించగా , వెయ్యిలోపు ర్యాంకులను 18 మంది సాధించారన్నారు.నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ బీఎస్.మూర్తి ఆధ్వర్యంలో, రిజిస్ట్రార్ డాక్టర్ దినేష్‌శంకర్‌రెడ్డి పర్యవేక్షణలో సంస్థలో చదువుతున్న విద్యార్థుల కోసం ప్రతీ ఏడాది ఉచిత గేట్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను వినోద్ కుమార్‌రాజాతో పాటు డీన్‌లు డాక్టర్ వీరేష్‌కుమార్, డాక్టర్ ఎస్.జయరాం, డాక్టర్ జీఆర్‌కే శాస్త్రి, డాక్టర్ కురుమయ్య, రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ అసోసియేట్ డీన్ డాక్టర్ వీ.సందీప్ అభినందించారు.

## ఆర్కిడ్ సొసైటీ ఇండియా ఉపాధ్యక్షుడిగా జానకీరామ్



తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 28: దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఆర్కిడ్ సాగును ప్రోత్సహించే ఆర్కిడ్ సొసైటీ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షునిగా డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వ విద్యాలయ ఉపకులపతి డాక్టర్ జానకిరామ్ నియమితుల య్యారు. ఆ సంస్థ కార్య నిర్వాహక మండలి వరుసగా రెండోసారి ఉపాధ్యక్షుడిగా జానకీరామ్‌ను పూణేలో నిర్వహించిన జాతీయ సదస్సులో ఎన్నుకున్నారు.



## అథ్లెటిక్స్‌కు గురుకుల విద్యార్థుల ఎంపిక

పెదవేగి, మార్చి 28 : పెదవేగిలో ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో గురువారం జరిగిన 19 ఏళ్ళ విభాగం మోడరన్ పెంటాథిలిన్ (అథ్లెటిక్) క్రీడా జట్ల ఎంపిక పోటీల్లో ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం విద్యార్థులు నలుగురు ఎంపికయ్యారని 19 ఏళ్ల విభాగం కార్యదర్శి కె.జయరాజు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 30, 31వ తేదీల్లో తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. విద్యార్థులను విద్యాలయం ప్రిన్సిపాల్ ఆది నారాయణ, పీఈటీ గురుమూర్తి, ఉపాధ్యాయులు అభినందించారు.

## కాపు సంక్షేమ సేన ఇక..కాపు, బలిజ సంక్షేమ సేన

పాలకొల్లు అర్బన్, మార్చి 28 : కాపు సంక్షేమ సేన ఇకపై కాపు, బలిజ సంక్షేమ సేనగా పనిచేస్తుందని వ్యవ స్థాపక అధ్యక్షుడు, మాజీ ఎంపీ చేగొండి హరి రామజోగయ్య తెలిపారు. గురువారం ఆయన నివాసంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ నూతన కమిటీ కార్యవర్గంగా 26 మందితో ఎంపిక చేసినట్టు తెలిపారు. వ్యవస్థాపక అధ్యక్షుడిగా చేగొండి జోగయ్య, గౌరవాధ్యక్షుడిగా బొలిశెట్టి సత్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా డాక్టర్ బూరగడ్డ శ్రీనాథ్, గంధం సత్య శేఖర్, ఉపాధ్యక్షుడిగా పెనుమాదు సాయి ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా చవాకుల సూర్య నరేష్ బాబు, కోశాధికారిగా బోణం వెంకట నర్సయ్యలతో పాటు ఐదుగురు గౌరవ సలహా దారులు, అనుబంధ విభాగాల కార్యవర్గాన్ని జోగయ్య ప్రకటించారు.

## ద్వారకా తిరుమల ఆలయ కల్యాణ మండప అద్దెలు పెంపు

ద్వారకా తిరుమల, మార్చి 28: ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయానికి చెందిన కొండపైన, దిగువనున్న కల్యాణ మండపాల అద్దెలను పెంచేందుకు ధర్మకర్తల మండలి తీర్మానించిందని ఆలయ ఈవో వేంద్ర త్రినాథరావు తెలిపారు. మండప నిర్వహణ, శానిటేషన్, విద్యుత్ వంటి ధరలు పెరిగిన కార ణంగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ధరల పెంపు విషయమై భక్తుల సలహాలు, అభ్యంతరాలను 15 రోజుల లోపు తెలియజేయాలని కోరారు. శేషాచలంపై ఉన్న వైజయంతి, వనమాలి ఏసీ కల్యాణ మండపాల ధరలను రూ.85 వేల నుంచి రూ.90 వేలకు పెంచామన్నారు. అనివేటి మంటపంలో ఇప్పటి వరకూ రూ.1000 ఉండగా రూ.1800 చేశారు.అలాగే నాన్ ఏసీ వసుంధర, వకుళమాత మండపాలను రూ.35 నుంచి రూ.40 వేలకు, ఏసీ శ్రీపద్మాలయ రూ.40 నుంచి 50 వేలకు, హరిణిని రూ.25 నుంచి 30 వేలకు పెంచామని తెలిపారు.

## మొదటి వారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి : జేసీ ఆదిత్య



భీమవరం, మార్చి 28 : జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏప్రిల్ మొదటి వారంలో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టరు ప్రవీణ్ ఆదిత్య అధి కారులను ఆదేశించారు. కలెక్టరేటులో గురువారం జిల్లా స్థాయి ధాన్యం కొనుగోలు కమిటీ, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ప్రస్తుత 2023-24 రబీ సీజన్‌లో రైతు పండించిన ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను అందించాలని, పంట అంచనా 9.45 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కాగా,7.50 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరణ లక్ష్యం ఉందన్నారు. రైతులకు ఏటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోలు సాఫీగా జరిగేలా చూడాలన్నారు. జిల్లాలో 324 రైతు భరోసా కేంద్రాలను సిద్ధం చేశామని. ధాన్యం తరలించడానికి ఇప్పటికే 1 కోటి 80 లక్షలు గోనె సంచులు సిద్ధం చేశామన్నారు. జిల్లాలో 211 పెద్ద,చిన్న రైసు మిల్లులకు కస్టోడియన్ అధికారులను నియ మించామని ధాన్యం తరలించడానికి 2,600 వాహనాలను సిద్ధం చేశామన్నారు. ఆర్డీవోలు కె.శ్రీనివాసులు రాజు, అచ్యుత అంబరీష్, కె.చెన్నయ్య, సివిల్ సప్లై జిల్లా మేనేజరు టి.శివరామ ప్రసాదు, డీఎస్‌వో సరోజ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా కోపరేటివ్ అధికారి నాగరాజు, పాల్గొన్నారు.

| 28-03-2024 పొగాకు ధరలు (రూ.) | పొగాకు కేంద్రం | గరిష్ఠం | కనిష్ఠం | సరాసరి |
|---|---|---|---|---|
|  | దేవరపల్లి | 241 | 235 | 239.54 |
| | జంగారెడ్డిగూడెం-1 | 241 | 235 | 239.59 |
| | జంగారెడ్డిగూడెం-2 | 241 | 235 | 239.48 |
| | కొయ్యలగూడెం | 241 | 235 | 239.36 |
| | గోపాలపురం | 245 | 235 | 238.72 |



# ఉల్లంఘనలపై నిరంతర నిఘా



### పారదర్శక ఎన్నికలకు ఏర్పాట్లు
### అక్రమాలపై సి-విజిల్‌కు ఫిర్యాదు
### 100 నిమిషాల్లోనే చర్యలు
### కలెక్టరేట్‌లలో కాల్ సెంటర్లు
### కంట్రోల్ రూమ్ ద్వారా కలెక్టర్ల పర్యవేక్షణ



ఏలూరుసిటీ, మార్చి28: ప్రజాస్వామ్య మనుగడకు ఎన్నికలే మూలాధారం. ఎన్నికల ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు ఎన్నికల ప్రక్రియపై నిరంతర నిఘా ఏర్పాటు చేశారు. వివిధ విభాగాలతో ఎన్నికల కంట్రోల్ రూమ్ ఏర్పాటైంది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన వెంటనే ఈ ఎలక్షన్ కంట్రోల్‌రూమ్‌లో కంప్లయింట్ సెల్ ముఖ్యమైన పాత్రను పోషి స్తోంది. దీని ఆధ్వర్యంలో సి-విజిల్, కాల్ సెంటర్, 1950 హెల్ప్‌లైన్ తదితర విభాగాలను ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికల కంట్రోల్ రూమ్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నేతృత్వంలో జిల్లా రెవెన్యూ అధికారి పుష్పమణి పర్యవేక్షిస్తున్నారు. సి-విజిల్ కంప్లెయింట్ సెల్‌కు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఎన్ఎస్ కృపవరం, సోషల్ మీడియాకు ఉద్యానశాఖ డీడీ రామ్మోహన్ పర్య వేక్షణాధికారులుగా వ్యవహరిస్తున్నారు.



### సి-విజిల్‌తో అక్రమాలకు చెక్

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అమలు చేసేందుకు, అక్రమాలపై వీలైనంత వేగంగా , సాక్ష్యాధారాలతో సహా ఫిర్యాదు చేసేందుకు ప్రజలకిచ్చిన గొప్ప అవకాశం సి-విజిల్ మొబైల్ యాప్. గూగుల్ ప్లేస్టోర్ నుంచి తమ మొబైల్‌కు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఎన్నికల్లో జరుగుతున్న అక్రమాలను ఆండ్రాయిడ్ ఫోన్‌లో రికార్డు చేసి ఆ యాప్ ద్వారా పంపాలి. ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత ఫ్లైయింగ్ స్క్వాడ్ లేదా ఇతర అధికారులకు సమాచారం వెళుతుంది. పరిశీలించి కేవలం 100 నిమిషాల్లోనే చర్యలు తీసుకుంటారు. ఈ యాప్ ద్వారా ఇంతవరకు జిల్లాలో ఏలూరు జిల్లాలో 77 ఫిర్యాదులను పరిష్క రించినట్టు సి-విజిల్ జిల్లా నోడల్ అధికారి ఎన్ఎస్ కృపావరం పేర్కొన్నారు. జిల్లాలో సి-విజిల్ ద్వారా అందే ఫిర్యాదుల పరిష్కారంపై జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ప్రతిరోజు అధికారులతో సమీక్షిసున్నారు.

### ఓటర్ హెల్ప్‌లైన్ 1950



ఓటర్లకు అన్ని రకాల సహాయ సహకారాలను అందించేందుకు ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ ఇది. ఈ టోల్‌ఫ్రీ నెంబర్‌కు జిల్లాకు చెందిన ఓటర్లు నేరుగా ఫోన్ చేసి తమ సమస్యలను తెలియజేయవచ్చు. కావాల్సిన సేవలను పొందవచ్చు. ఈకాల్ సెంటర్ 24 గంటలూ పని చేస్తుంది. ఇక్కడకు వచ్చిన ఫోన్‌లను రికార్డు చేసి చర్యల కోసం సంబంధిత నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి పంపిస్తారు.

### 24 గంటలూ కాల్ సెంటర్

ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన వెంటనే ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా స్థాయి కాల్ సెంటర్ ఏర్పాటు అయింది. ఏలూరుకు సబంధించి ఫోన్ నెంబరు 1800 2331077కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. ఇది కూడా 24 గంటలూ పనిచేస్తుంది. ఇక్కడికి వచ్చే ఫిర్యాదులను, వినతులను తక్షణమే సంబంధిత అధికారులకు పంపించి చర్యలు తీసుకోవడం జరుగుతుంది.అలాగే పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించి 08816-299616, 08816-299617, 08816-299618 నంబర్లు ఏర్పాటు చేశారు.

### ఎన్‌జీఎస్ పోర్టల్

నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్ వెబ్‌సైట్‌లో ఓటర్లు నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. అలాగే ఓటర్ హెల్ప్‌లైన్, ఓటర్ పోర్టల్, ఓటర్ మిత్రాలో కూడా ఫిర్యాదు చేయవచ్చు. ఆయా వెబ్‌సైట్లకు లేదా హెల్ప్‌లైన్లకు వచ్చే ఫిర్యాదులు, వినతులను పరిశీలించి సంబంధిత విభాగాలకు , ఆయా శాఖల అధికారులకు పంపిస్తారు. అలాగే రాష్ట్ర ఎన్నికల అధికారికి కూడా నేరుగా ఫిర్యాదు చేసే అవకాశాన్ని కూడా కల్పించారు.

### దివ్యాంగుల కోసం సాక్ష్యం యాప్




ఇది ప్రత్యేకంగా దివ్యాంగుల కోసం రూపొం దించింది. సదరం ప్రకారం 40 శాతం వికలాంగత్వం దాటిన దివ్యాంగులు ఇంటి నుంచే వివిధ సేవలను పొందే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించింది. దీని కోసం సాక్ష్యం (ఎస్ఏకె ఎస్‌హెచ్ఎం) యాప్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. అలాగే ఓటు రిజిస్ట్రేషన్, బదిలీలు, మార్పులు, ఎపిక్ కార్డులలో మార్పు, రవాణా సదు పాయం, వీల్‌చైర్ తదితర ఏర్పాట్ల కోసం ఈ యాప్‌లో దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలి.

### మీడియా మోనిటరింగ్ సెల్

పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాలో ఎన్నికలకు సంబంధించి వచ్చే వార్తలు, వ్యతిరేక వార్తలు, ప్రకటనలను ఈ విభాగం నిరంతరం పరిశీలిస్తుంది. ముఖ్యంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై వచ్చే వార్తలపై ప్రత్యేక దృష్టి సారిస్తుంది. ఎన్నికల కోడ్ ఉల్లంఘన, అనధికార ప్రకటనలు, అనుమతి లేని ప్రచారవార్తలు, పెయిడ్ న్యూస్ సేకరించి చర్యలు నిమిత్తం సంబంధిత ఆర్వోలకు పంపిస్తారు. ఇప్పుడు ఎన్నికల ప్రక్రియలో సోషల్ మీడియా అత్యంత చురుకైన పాత్రను పోషిస్తోంది. ఫేస్‌బుక్, ఎక్స్ (ట్విట్టర్), ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ తదితర సోషల్ మీడియాలో వచ్చే ఎన్నికల ప్రచారం, ప్రకటనలు, పోస్టింగులపై ఈ విభాగం అధికారులు నిరంతరం పర్య వేక్షిస్తున్నారు. కొంతమంది రాజకీయ ప్రముఖుల సోషల్ మీడియా ఖాతాలపై ప్రత్యేకంగా నిఘా పెట్టి వారు పెట్టే పోస్టింగ్‌లను పరిశీలిస్తున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అతిక్రమించే పోస్టింగ్‌లపై చర్యలు తీసుకుంటారు.


### రిపోర్ట్ మోనిటరింగ్ సెల్

వివిధ విభాగాలకు వచ్చే ఫిర్యాదులు, జిల్లాలో నమోదు చేసిన కేసులు, వాటిపై తీసుకున్న చర్యలను జిల్లా ఎన్నికల అధికారి ద్వారా ముఖ్య ఎన్నికల అధికారికి ప్రతీ రోజు పంపిస్తారు. అన్ని విభాగాల నుంచి రిపోర్ట్స్ సేకరించి, తుది నివేదికను తయారు చేస్తారు. ఈ రిపోర్ట్స్ మోనటరింగ్ విభాగాన్ని జిల్లా పరిషత్ సీఈవో సుబ్బారావు పర్యవేక్షిస్తున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, వ్యయ పరిశీలన నోడల్ అధికారులు సైతం ఎన్నికల కంట్రోల్ రూమ్ నుంచే పర్యవేక్షిస్తున్నారు.

# పురపాలక సంఘాల్లో పన్ను బాదుడు

### ఐదేళ్లలో 100 శాతం పెరిగిన పన్నులు
### ఆస్తి విలువ పెంచేస్తూ వడ్డింపులు
### మార్కెట్‌లో పడిపోయిన ఆస్తి విలువలు
### ఏప్రిల్ మరోసారి పెంచేందుకు రంగం సిద్ధం

పాలకొల్లు, మార్చి 28 : జిల్లాలోని పురపాలక సంఘాలలో ఆస్తి పన్ను మదింపు వ్యవహారం నిలువు దోపిడీ చందంగా మారింది. గడిచిన ఐదేళ్ళ కాలంలో ఆస్తి పన్ను దాదాపు రెట్టింపయ్యాయి. ఆస్తి విలువలను కృత్రిమంగా పెంచేస్తూ ఏటికేడాది పన్నులు పెంచివేయడంతో సామాన్యులు పన్నులు కట్టలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. గతేడాది ఆర్థిక సంవత్సరాంతంలో ఆస్తి పన్నుబకాయిలపై వడ్డీ రాయితీ ఇచ్చారు. ఇప్పుడు మార్చి 31 లోపు పన్ను బకాయి దారులు పుర్తిగా పన్నుచెల్లిస్తే 100 శాతం వడ్డీ రాయితీ ఇచ్చారు. అయినప్పటికీ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఏలూరు కార్పొరేషన్‌తో సహా అన్ని మునిసిపాలిటీలలోనూ లక్షలాది రూపాయల పన్ను బకాయిలు పేరుకుపోయాయి.దీనికి ప్రధాన కారణం ఆస్తిపన్ను పెంపుదలేనని తెలుస్తోంది. తాడేపల్లిగూడెంలో గత టీడీపీ ప్రభుత్వ హయంలో సాలీనా రూ.6 కోట్లు డిమాండ్ ఉండగా ఇప్పడది సుమారి రూ14 కోట్లకు చేరింది. భీమవరం మున్సిపాలిటీలో గతంలో 10 కోట్లు డిమాండ్ ఉండగా ఇప్పుడు రూ. 25 కోట్లకు పైబడింది. పాలకొల్లులో 2019 నాటికీ కేవలం రూ. 3.10 కోట్లు డిమాండ్ కాగా ఇప్పుడు రమారమి రూ.7 కోట్లకు చేరింది. పన్ను మదింపు సమయంలో సబ్ రిజిస్ట్రారు కార్యాలయాలలో పెరిగిన ఆస్తి విలువలకు అనుగుణంగా ఆయా పురపాలక సంఘాలలో ఆస్తి పన్నులు పెంచుతారు. అయితే జగన్‌రెడ్డి హవా మొదలైన తరువాత ఏటికేడాది పన్నులు పెంచే ప్రక్రియకు తెరతీశారు. ఈ పన్ను పెంపుదల ఆస్తి విలువలు పెరుగుదల ఆధారంగా 2 నుంచి 15 శాతం ఉంటుంది.




ఇప్పటికే పెరిగిన ధరలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్య తరగతి ప్రజలు ఆస్తి పన్నులను చెల్లించలేక పోతున్నారు. మరోవైపు అపరాధ రుసుముగా 24 శాతం వడ్డీ వసూలు చేస్తున్నారు. 2023 డిసెంబరు లోపుగా ఎన్నికలు జరుగుతాయనే ఉద్దేశంతో గతేడాది బాకీదారులకు వడ్డీ రాయితీ ఇచ్చారు. ఎన్నికలు జరగక పోవడం, ఇప్పుడు ఎన్నికలు జరగనుండటంతో మరోసాయి తాయిలంగా వడ్డీరాయితీ ప్రకటించారు. పెంచిన మొత్తాలనే కట్టలేని స్థితిలో వడ్డీరాయితీ ఇస్తే లాభం ఏమిటని పేద వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి

### పన్ను పెంపు సరే..మౌలిక వసతులేవీ ..?

పట్టణాలలో మౌలిక వసతులు కరువయ్యాయి. అన్ని కాలాల్లోనూ దోమల బెడద తప్పడం లేదు. డ్రైయినేజీలలో షిల్టు తొలగించకపోవడంతో దోమలు పెరిగిపోయాయి. మరోవైపు పాలకొల్లు సహా పలు పట్టణాలలో పందులు, పశువుల బెడద వదలడం లేదు. మౌలిక వసతులు కల్పనలో ప్రగతి చూపించలేనప్పుడు దారుణంగా పన్నులు వసూలు చేయడం పట్ల పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వచ్చే ఎన్నికలలో మౌలిక వసతులు మెరుగుపరిచే నాయకులకే ఓటు వేస్తామని చెబుతున్నారు. వచ్చే ఏప్రిల్ నుంచి మరో దఫా ఆస్తిపన్నులు పెంచే యోచన విరమించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# జిల్లాలో 8 చెక్‌పోస్ట్‌లు.. 31 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు

### ఏలూరు ఎస్పీ ప్రశాంతి



ఏలూరు క్రైం, మార్చి 28 : సార్వత్రిక ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు. గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా 45.49 లీటర్ల నాటుసారా, మద్యం స్వాధీనం చేసుకోవడం జరిగిందని వాటి విలువ 22 వేల 750 రూపాయలు అని ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్‌లు స్వాధీనం చేసుకున్న నగదు 61,700 రూపాయలు అని తెలిపారు. ఏలూరు జిల్లా వ్యాప్తంగా అంతర్‌రాష్ట్ర, అంతర్ జిల్లాల్లో ఎనిమిది చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తారని తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటికి 31 ఫ్లైయింగ్ సర్వేలెన్స్ టీమ్‌లు ఆకస్మికంగా వివిధ ప్రాంతాల్లో తనిఖీలు చేస్తున్నాయన్నారు. ఓటర్లను ఎవరైనా ప్రలోభపెట్టినా, వారికి ఆకంటం కల్గించినా కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరైనా మత సంబంధమైన విషయాలపై లేదా ఎదుటి పార్టీ వారిపై విమర్శలు కాని చేయరాదని, ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరు నడుచుకోవాలని సూచించారు.



చెక్‌పోస్టు తనిఖీ చేస్తున్న జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల

## చెక్‌పోస్టులలో అప్రమత్తంగా వ్యవహరించాలి

### పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల

భీమవరం క్రైం, మార్చి 28 : భీమవరం రూరల్ మండలం లోసరి గ్రామం వద్ద ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా చెక్ పోస్టును జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహనాల తనిఖీలను పరిశీలించి, చెక్ పోస్టు వద్ద సిబ్బందికి కావల్సిన మౌలిక సదుపాయాలు గురించి, అక్కడ డ్యూటీ నిర్వహిస్తున్న అధికారులకు తీసుకోవల్సిన జాగ్రత్తలను సూచించారు. చెక్ పోస్టు విధులు నిర్వహించే పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రతి నిత్యం అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఎన్నికల సందర్భంగా నగదు, అక్రమ మద్యం, ప్రజలను ప్రలోభాలకు గురిచెయ్యడానికి అవకాశం ఉన్న వస్తువులు తరలింపును అడ్డుకునేందుకు జిల్లాలో ప్రస్తుతం మొత్తం ఐదు చెక్ పోస్టులను ఏర్పాటు చెశామన్నారు. ఇతర జిల్లాల సరిహద్దులలో నాలుగు చెక్ పోస్టులు, జిల్లా అంతర్గతంగా ప్రధానమైన ప్రదేశాలలో మరొక చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. రోజు మూడు షిఫ్టులలో పోలీస్ సిబ్బంది విధులు నిర్వహిస్తూ 24 గంటలు అప్రమత్తంగా ఉండే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్ళేటప్పుడు రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్లొద్దని, ఒక వేళ అవసరాల రీత్యా తీసుకెళ్తే సంబంధిత ఆధారాలు, ధృవీకరణ పత్రాలను అధికారులకు చూపించాలన్నారు.

# ఇకనైనా రెగ్యులర్ డీవైఈవోని వేస్తారా ?

### రెండేళ్లుగా ఇన్‌చార్జిల పాలనలో అస్తవ్యస్తం
### అందుబాటులో ఉండని ఏలూరు ఉప విద్యాశాఖాధికారి
### పెండింగ్ పనులపై ఉపాధ్యాయ వర్గాలు తీవ్ర అసంతృప్తి

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 28 : ఉమ్మడి జిల్లాకేంద్రానికి రెగ్యులర్ ఉప విద్యా శాఖాధికారి (డీవైఈవో) లేకపోవడంతో పలు విద్యా కార్యకలాపాలు, ఉపాధ్యాయులకు సంబందించిన వివిధ పనులు పెండింగ్‌లో ఉంటున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కీలకమైన పదో తరగతి పరీక్షలు, మూల్యాంకన, టెట్, డీఎస్సీ నిర్వహణ ఏర్పాట్లు, ఉపాధ్యాయులకు సంబంధించిన సర్వీసు విషయాలు తదితరమైనవన్నీ ఏలూరు డివిజన్‌కు సంబంధించి ఉప విద్యా శాఖాదికారి పరిశీలన, ఆమోదం అనంతరమే ప్రతిపాదనలు జిల్లా అధికారికి వెళ్తాయి. విద్యాశాఖకు చెందిన ఉన్నతాధికారులు జిల్లా పర్యటనకు వస్తే క్షేత్ర స్థాయి తనిఖీలు, సందర్శనలకు డీవైఈవో సహకరించాల్సి ఉంటుంది. ఇంతటి ప్రాధాన్యం గల ఉప విద్యాశాఖాధికారి పోస్టు 2022 మార్చి నెల నుంచి తెరమరుగుగా ఉంటోంది. మరీ ముఖ్యంగా గతేడాది జూలైలో అప్పటి డీఎస్ఈవో బాధ్యతలనుంచి వైదొలగిన నాటి నుంచి ఏలూరు డివిజన్ విద్యా శాఖ కార్యకలాపాలు చురుకుగా జరగడం లేదు. డివిజన్ పరిధిలోని మండలాల్లోని పాఠశాలలు, టీచర్ల పర్యవేక్షణ లోపభూయిష్టంగా ఉంటోందన్న విమర్శలు వస్తున్నాయి. ఏళ్ళ తరబడి ఏలూరు డీవైఈవో పోస్టులో ఇన్‌చార్జి అధికారులే కొనసాగుతుండటం,వారు కూడా డివిజన్ కేంద్రానికి అందుబాటులో లేకుండా పోవడంతో కీలకమైన పనులు కార్యరూపం దాల్చడానికి తీవ్ర జాప్యం అవుతోందని చెబుతున్నారు. ఉపాధ్యాయుల పాస్‌పోర్టులు, వీసాలు, సర్వీస్ రెగ్యులరైజేషన్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ తదితర ప్రతి పాదనలకు డివిజన్ స్థాయిలో తొలుత డీవైఈవో పరిశీలన, అనుమతులు దాటిన తర్వాతే తుది ఆమోదం నిమిత్తం డీఈవోకు పంపిస్తారు. ప్రస్తుతం ఏలూరు డివిజన్ విద్యాశాఖలో పూర్తిస్థాయి డీవైఈవో జిల్లాకేంద్రంలో అందుబాటులో లేకపోవడంతో ఈ పనులన్నీ జిల్లా అధికారిపైనే పడుతున్నాయని తెలుస్తోంది. దీనిపై డీఈవో కార్యాలయ వర్గాలను వివరణకోరగా ' ఏలూరు డివిజన్ డీవైఈవోగా ప్రస్తుతం ఇన్‌చార్జిగా వ్యవహరిస్తోన్న అధికారి ఇటీవలే తూర్పుగోదావరి జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా నియమితులైనట్టు తెలిసింది. ఆయన కొద్దిరోజుల్లోనే రిలీవయ్యే అవకాశం ఉంది. డివిజన్‌కు పూర్తి స్థాయి ఉపవిద్యాశాఖాదికారిని నియమించాలని రాష్ట్రస్థాయి విద్యాధికారుల దృష్టికి తీసుకెళ్లే విషయమై ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారు. ఇన్‌చార్జి డీవైఈవోల పాలనలోనూ ఇంతవరకు ఏ ఒక్క పనీ పెండింగ్‌లో లేదు. అన్నీ సజావుగానే సకాలంలో జరుగుతున్నాయి.' అని వివరించాయి.

## క్రైం కార్నర్

### 8 వందల లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం



పోలవరం, మార్చి 28 : పోలవరం మండలం ఎల్లండీపేట గ్రామ శివార్లలో నాటుసారా తయారీ బట్టీలపై దాడులు నిర్వహించి 8 వందల లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసి 50 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పవన్ కుమార్ తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం రవాణా, అమ్మకాలు, పంపిణీ, నాటుసారా తయారీ, రవాణా, విక్రయాలపై ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక దృష్టి కేంద్రీకరిసున్నామన్నారు.

### సారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

టి.నరసాపురం, మార్చి 28 : నాటు సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ డి.దుర్గామహేశ్వరరావు తెలిపారు. టి.నరసాపురంలో సారా విక్రయిస్తున్నారనే సమాచారంతో గురువారం తన సిబ్బందితో దాడి చేసి ఆరు లీటర్లు సారా స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

### అక్రమ మద్యం స్వాధీనం

ఆకివీడు, మార్చి 28: అక్రమ మద్యం తీసుకెళ్ళుతున్న నరశింహమూర్తిని ఉప్పుటేరు చెక్‌పోస్టు దగ్గర గురువారం అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామని ఎస్ఐ బత్తిన నాగబాబు తెలిపారు. అతని దగ్గర నుంచి మద్యం 11 క్వార్టర్ బాటిల్స్, 5 బీరు సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

### రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

భీమడోలు, మార్చి 28 : మండలంలోని కురేళ్ళగూడెం గ్రామంలోని భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని సుమారు 40 నుంచి 50 సంవత్సరాల వయసు కల్గిన గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు భీమడోలు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.ఈ నెల 26వ తేదీ ఉదయం 4 గంటల సమీపంలో ఈ ప్రమాదం జరిగిందని తీవ్ర గాయాలవడంతో వైద్యం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా బుధవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 94407 96652 నెంబర్‌కు ఫోన్ చేయాలని ఎస్ఐ కోరారు.

### మనస్థాపంతో భర్త ఆత్మహత్య

ఏలూరు క్రైం, మార్చి 28 : భార్య భర్తల మధ్య తలెత్తిన వివాదంతో తీవ్ర మనస్థాపానికి గురైన ఒక వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వేలేరుపాడు మండలం శివకాశీపురానికి చెందిన పొట్ల వెంకటేష్ (38) దెందులూరు మండలం పోతునూరు మండలం చేపల చెరువుపై కాపలాగా తన కుటుంబంతో ఉంటున్నాడు. అతని భార్యతో గొడవ జరగడంతో మనస్థాపానికి గురై బుధవారం పురుగుమందు తాగాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

### బస్సు ఢీకొని వృద్ధుడి మృతి

ఏలూరు క్రైం, మార్చి 28 : రోడ్డు దాటుతున్న ఒక వృద్ధుడిని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.దెందులూరు మండలం చల్లపల్లికి చెందిన పర్సా కోటేశ్వరరావు (74) గురువారం తణుకు ఆసుపత్రికి వెళ్ళి తిరిగి గురువారం రాత్రి ఏలూరు పాత బస్టాండ్ వద్ద బస్సు దిగారు. రోడ్డు దాటుతుండగా తాడేపల్లిగూడెం నుంచి ఏలూరు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో కోటేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. టూటౌన్ సీఐ ప్రభాకరరావు ఆధ్వర్యంలో ఎస్ఐ మదీనా బాషా సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### వివాహిత ఆత్మహత్య

జంగారెడ్డిగూడెం, మార్చి 28 : వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జ్యోతిబసు తెలిపారు. పట్టణానికి చెందిన సాంబమూర్తి జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. భార్య రత్నగిరి రాధిక (31)తో కలిసి స్థానిక లక్ష్మీ గణపతి టౌన్‌షిప్‌లో నివాసం ఉంటున్నారు. ఈనెల 27న రాధిక ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబసభ్యులు వెంటనే ఆమెను ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. తన కుమార్తె మృతికి భర్త సాంబమూర్తి, అతని కుటుంబ సభ్యులే కారణమని మృతురాలి తండ్రి వెంకయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

### చీటింగ్ కేసు నమోదు

ఉండి, మార్చి 28: మోకానిక్‌గా పనిచేస్తున్న వ్యక్తిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఉండి ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు. ఉండికి చెందిన పాలూరు బాలాజీ చెరువులకు మోటార్లు అందిస్తుంటాడు. అతని వద్ద వున్న మోటర్ రిపేరుకు రావడంతో గ్రామానికి చెందిన మెకానిక్ హరీష్‌కు ఫిబ్రవరి 21న రిపేరుకు ఇచ్చాడు. చాలా రోజులు అవడంతో అతని వద్దకు వెళ్లి అడిగాడు. మోటర్‌ను పరిశీలించగా రాగి వైరు కనిపించకపోవడంతో మెకానిక్‌ను నిలదీయగా మెకానిక్ దురుసుగా ప్రవర్తించి చంపుతానని బెదరించాడని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

### బంగారం చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

అమలాపురం టౌన్, మార్చి 28: గత ఏడాది జరిగిన ఇంటి దొంగతనం కేసులో పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఇద్దరు దొంగలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 52 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు అమలాపురం డీఎస్పీ మహేశ్వరరావు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం స్వామి వివేకానంద వీధిలో నివాసం ఉంటున్న పేరాబత్తుల రాధాకృష్ణ కుటుంబ సభ్యులతో కలిసి గత ఏడాది సెప్టెంబరు 8న హైదరాబాద్ వెళ్లాడు. అక్కడ దిగేసరికి ఇంటి తాళాలు పగులకొట్టి కనిపించాయని చూసిన సమీప నివాసితులు రాధాకృష్ణకు ఫోను చేశారు. తిరిగి వచ్చి అమలాపురం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి సీఐ టి.క్రాంతికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన ఈత కోట రాజ్‌కుమార్‌ను అరెస్టు చేసి అతని వద్ద నుంచి 4.015 గ్రాముల బంగారాన్ని రికవరీ చేసి అప్పట్లో కోర్టులో హాజరుపరిచారు. పాలకొల్లుకు చెందిన తానింకి నరేష్ (25), తమ్మినీడి షణ్ముఖమణి (31)లను అమలాపురం పట్టణ సీఐ కె.క్రిస్టఫర్ బుధవారం అరెస్టు చేసి బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్

## గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలపై నిఘా : కలెక్టర్

ఏలూరు కలెక్టరేట్, మార్చి 28: జిల్లాలో గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలపై నిఘా ఉంచాలని, చట్టం పటిష్టంగా అమలు చేసేందుకు డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించాలని కలెక్టర్ వై.ప్రసన్న వెంకటేశ్ అధికారులను ఆదేశించారు. గర్భస్థ లింగ నిర్ధారణ నియంత్రణ చట్టం అమలుపై జిల్లా కమిటీ సమావేశం గురువారం కలెక్టరేట్‌లో జరిగింది. జిల్లాలోని ప్రతి స్కానింగ్ సెంటర్‌పై నిఘా కెమెరాలతో డెకాయ్ ఆపరేషన్ నిర్వహించాలని, చట్టాన్ని అతిక్రమించిన స్కానింగ్ కేంద్రాలను సీజ్‌చేసి, సంబంధిత స్కానింగ్ కేంద్రాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. మూడు నెలల్లో జిల్లాలోని వివిధ ఆసుపత్రులలో 136 అబార్షన్లు జరిగాయని, చట్టాన్ని అతిక్రమించి అబార్షన్లు చేసిన ఆసుపత్రులపై కేసులు నమోదు చేయాలన్నారు. లింగ నిర్ధారణ నియంత్రణ చట్టంపై విద్యార్థులకు అవగాహన కలిగించేందుకు పాఠశాల స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలని సూచించారు. స్కానింగ్ కేంద్రాల ఏర్పాటుకు అందిన దరఖాస్తులను పరిశీలించి, నిబంధనల మేరకు ఉన్నవాటికి అనుమతులు మంజూరు చేయాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ స్వరూపరాణి, జిల్లా వైద్యాధికారి శర్మిష్ఠ, డీసీహెచ్ఎస్ పాల్ సతీష్, డాక్టర్ నాగేశ్వర రావు, డాక్టర్ మేరీ కేథరిన్, ఐసీడీఎస్ పీడీ పద్మావతి, జిల్లా బాలల సంరక్షణాధికారి సూర్యచక్రవేణి, కమిటీ మెంబర్లు కేబీ.సీతారాం పాల్గొన్నారు.

## 'స్పాట్' విధుల నుంచి మినహాయింపు ఇవ్వండి

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 28: పదో తరగతి పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకన విధులు నిర్వర్తించలేని వారికి మినహాయింపు ఇవ్వాలని పీఆర్‌టీయూ నేతలు డీఈవోకు విజ్ఞప్తి చేశారు. మూల్యాంకన ప్రాంతంలో గాలి, వెలుతురు, సౌకర్యవంతమైన బెంచీలు, మంచినీరు, మరుగుదొడ్లు, మెడికల్ ఎమర్జెన్సీ సిబ్బందిని ఏర్పాటుచేయాలని గురువారం డీఈవోకు వినతిపత్రాన్ని అందజేశారు. అనారోగ్య ఇబ్బందులతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు మినహాయింపునిచ్చే విషయాన్ని పరిశీలించాలని కోరారు. మినహాయింపు కోరిన దరఖాస్తులు కొన్ని మాత్రమే ఆమోదించారని, మిగిలిన దరఖాస్తులు కూడా పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. వయస్సు పైబడిన వారికి 8 గంటలపాటు జవాబు పత్రాలను మూల్యాంకన చేయడం, మార్కుల నమోదు కష్టమని వివరించారు. మహిళల సమస్యలనుకూడా పరిగణనలోకి తీసుకోవాలన్నారు. రంజాన్ ఉపవాసాల దృష్ట్యా ముస్లిం టీచర్లకు మినహాయింపులనివ్వాలని కోరారు. డీఈవో అబ్రహం మాట్లాడుతూ ఇప్పటికే కొందరికి మినహాయింపునిచ్చామని, మిగతావారు విధులు చేయాల్సిందేనని' స్పష్టం చేసినట్లు పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు వివరించారు.

## ఉపాధి కూలీలకు వేతనం ఇవ్వాలి



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న నేతలు

జంగారెడ్డిగూడెం, మార్చి 28 : ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వలేదని, వెంటనే అందజేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి అందుగుల ప్రభాకరరావు, జిల్లా అధ్యక్షుడు ఎం.జీవరత్నం అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఉపాధి వేతన బకాయిలు విడుదల చేయాలని గురువారం ఎంపీడీవో ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఉపాధి కూలీలు అప్పులు తెచ్చుకుని కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. పే స్లిప్పులు ఇవ్వాలని, 200 రోజులు పనులు పెంచి, పెరిగిన నిత్యవసర సరుకుల ధరలకు అనుగుణంగా రూ.600 ఇవ్వాలని, పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలైన మంచినీరు మజ్జిగ పనిముట్లు మెడికల్ కిట్లు ప్రభుత్వమే కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం మండల నాయకులు యాగంటి సీత, కె.సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠ



కోదండ రామాలయం

లింగపాలెం, మార్చి 28: కోదండ రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ గురువారం వైభవంగా నిర్వహించారు. లింగపాలెంలో 160 ఏళ్ల చరిత్ర కలిగిన కోదండ రామాలయం జీర్ణావస్థకు చేరడంతో ఆలయాన్ని పునర్నిర్మించారు. ఆలయంలో సీతారాముల విగ్రహాలతో పాటు రామలక్ష్మణ, హనుమ విగ్రహాలను గురువారం ప్రతిష్ఠించారు. వేదమంత్రాలు, మేళతాళాల నడుమ ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేశారు. వివిధ గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు హాజరయ్యారు. అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు.

## పారిజాతగిరి వెంకన్న హుండీ ఆదాయం రూ.7.76 లక్షలు



హుండీల ఆదాయం లెక్కిస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం, మార్చి 28 : గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.7.76 లక్షలు వచ్చింది. పర్యవేక్షదారు ఎంఎస్ఎస్ఎస్‌శర్మ ఆధ్వర్యంలో గురువారం హుండీ ఆదాయం లెక్కించారు. 90 రోజుల రూ.7,76,100 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో మానికల రాంబాబు తెలిపారు. పుట్లగట్లగుడెం సేవ సంఘం, ములగలం పల్లి సేవ సంఘం సభ్యులు, భక్తులు సిబ్బంది పాల్గొన్నారు.

### ఆర్‌ఆర్ పేట వెంకన్న హుండీ ఆదాయం రూ.5.50 లక్షలు

ఏలూరు కార్పొరేషన్: రామచంద్రరావుపేట వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీని గురువారం లెక్కించారు, రూ.5.50 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో నాగం సన్యాసిరావు, అర్చకులు కిళాంబి మారుతి శ్రీనివాస రామానుజాచార్యులు తెలిపారు. హుండీ ఆదాయం లెక్కింపులో భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీస్ కుటుంబ సభ్యులకు అండగా ఉంటాం : ఏఎస్పీ



చెక్కును అందిస్తున్న ఏఎస్పీ స్వరూపరాణి

ఏలూరు క్రైం, మార్చి 28 : మరణించిన పోలీస్ కుటుంబ సభ్యులకు పోలీస్‌శాఖ అండగా ఉంటుందని ఏఎస్పీ జి స్వరూప రాణి అన్నారు. పోలీస్‌శాఖలో పనిచేస్తూ అనారోగ్యంతో మరణించిన హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర రావుకు కార్పస్ ఫండ్‌గా వచ్చిన రూ.లక్ష చెక్కును వెంకటేశ్వరరావు సతీమణి ప్రమీలారాణికి ఏఎస్పీ గురువారం అందజేశారు. ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.



పారామిలటరీ దళాలతో డీఎస్పీ శ్రీనివాసులు, సిబ్బంది కవాతు

## ఏలూరు నగరంలో సాయుధ బలగాల కవాతు

ఏలూరు క్రైం, మార్చి 28 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలను కాపాడేందుకు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు ఆధ్వర్యంలో త్రీటౌన్ ఎస్‌ఐ ప్రసాద్, సిబ్బంది గురువారం పారామిలటరీ దళాలతో కవాతు నిర్వహించారు. సెయింట్ ఆన్స్ కాలేజీ నుంచి శనివారపుపేట, దుగ్గిరాల, ప్రాంతాల్లో కవాతు నిర్వహించారు. ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకోవడానికి ఆత్మస్థైర్యం కల్పించడానికి కవాతు నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం రాజకీయ పార్టీలకు సంబంధించిన గుర్తులు కలిగి ఉండరాదన్నారు. సభలు, సమావేశాలకు సువిధ యాప్ ద్వారా అనుమతులు పొందాలన్నారు. ఓటర్లను ప్రలోభం చేసినా బెదిరించినా సహించలేదన్నారు.

● టి.నరసాపురం: ప్రశాంత వాతావరణంలో ఓటును వినియోగించుకోవాలని సీఐ క్రాంతికుమార్ అన్నారు. బంధంచర్ల, అల్లంచర్లరాజుపాలెం, కేతవరం, వెలగపాడు గ్రామ పంచాయతీల్లో గురువారం స్పెషల్ బెటాలియన్ పోలీసులతో కవాతు నిర్వహించారు. మండలంలోని నాలుగు గ్రామ పంచాయతీల్లో కవాతు నిర్వహించినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఓటర్ల కు భరోసా కల్పించడానికే కవాతు నిర్వహించారు. ఆయనతో పాటు ఎస్‌ఐ దుర్గామహేశ్వరవు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ఏలూరులో మినీ మేనిఫెస్టో వివరిస్తున్న బడేటి చంటి



టీడీపీలో చేరిన వారికి పార్టీ కండువా వేసిన చింతమనేని



సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తున్న మద్దిపాటి వెంకట్రాజు



ధర్మాజీగూడెంలో కూటమి అభ్యర్థి రోషన్‌కుమార్ ప్రచారం

# కూటమి అభ్యర్థులను గెలిపించాలి

### ప్రజలను కలుస్తున్న టీడీపీ, జనసేన అభ్యర్థులు

ఏలూరు టూటౌన్, మార్చి 28: రాష్ట్రాభివృద్ధి, రక్షణకు కూటమి ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటు కావాలని, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని నాయకులు, అభ్యర్థులు ప్రజలను కోరుతున్నారు. ఏలూరు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బడేటి చంటి ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా గురువారం 23, 24, 13, 14 డివిజన్లలో ప్రజలను కలిశారు. ఇంటింటికి వెళ్లి కూటమి అధికారంలోకి వస్తే అమలయ్యే పథకాలు వివరించారు. ప్రజల భవిష్యత్‌ను బాధ్యతగా స్వీకరించే కూటమిని గెలిపించుకోవల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. ఏలూరు ఉమ్మడి అభ్యర్థిగా తనను గెలిపించాలని చంటి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కడియాల విజయలక్ష్మి, మాణిక్యాలరావు, ఎస్.రాము, రెడ్డి రాంబాబు, కె.రమేష్, షేక్ సులేమాన్, తదితరలు పాల్గొన్నారు.

### రానున్నది కూటమి ప్రభుత్వమే : మద్దిపాటి

ద్వారకాతిరుమల: జగన్ ఐదేళ్ల విధ్వంసకర పాలనలో గ్రామ పంచాయతీల నిధులను సైతం దోచేశారని, రానున్నది తమ కూటమి ప్రభుత్వమేనని గోపాలపురం నియోజకవర్గ టీడీపీ ఉమ్మడి అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. మండలంలోని దొరసానిపాడు, పోతేపల్లి, మద్దులగూడెం గ్రామాల్లో మండల పార్టీ అధ్యక్షుడు లంకా సత్యన్నారాయణ ఆధ్వర్యంలో గురువారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. జగన్ పాలనలో గ్రామాల్లో కనీస సౌకర్యాలు సైతం కరువయ్యాయన్నారు. రానున్న రోజుల్లో గ్రామాలకు ఆర్థిక స్వరాజ్యం వచ్చేలా తమ ప్రణాళిక ఉంటుందని స్పష్టం చేశారు. పలువురు వైసీపీ కార్యకర్తలు టీడీపీలోకి చేరగా వారికి ఆయన కండువా కప్పి ఆహ్వానించారు.

### వైసీపీ నుంచి టీడీపీలో చేరికలు

పెదవేగి: దెందులూరులో వైసీపీ నుంచి వరుసపెట్టి టీడీపీలో చేరుతున్నారు. జగన్నాధపురం గ్రామానికి చెందిన కమ్మ రాజారావు తాను వైసీపీలో చేరలేదని, బంధువుల ఇంటికి పరామర్శకు వెళ్ళిన తనకు ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి బలవంతంగా కండువా వేశారన్నారు. చింతమనేని ప్రభాకర్‌కు ఫోన్ చేయడంతో ప్రభాకర్ రాజారావు ఇంటికి వెళ్లి టీడీపీ కండువా వేశారు.

పెదకడిమికి చెందిన ఏఎంసీ డైరెక్టర్ కొసరాజు రత్నకుమారి భర్త, వైసీపీ సీనియర్ నాయకుడు కొసరాజు ముఖర్జీ చింతమనేని సమక్షంలో టీడీపీలో చేరారు. ఐదేళ్లుగా జగన్‌రెడ్డి ప్రజలను మభ్యపెట్టారని విమర్శించారు. చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ దెందులూరు నియోజకవర్గంలో వైసీపీ నాయకులు చిల్లర రాజకీయాలు చేస్తున్నారన్నారు.

● లింగపాలెం: ధర్మాజీగూడెంలో గరిమెళ్ళ చలపతిరావు ఆధ్వర్యంలో కూటమి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ ప్రతి ఇంటికి తిరిగి సూపర్‌సిక్స్ పథకాలు వివరించారు. తెలుగుదేశంపార్టీ హయాంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు అన్నారు. జగన్ రెడ్డి పాలనలో అభివృద్ధి లేదని, అవినీతి పెరిగిందన్నారు. రోషన్‌కుమార్ సమక్షంలో ధర్మాజీగూడెంలోని 40 పైగా కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వైసీపీ ప్రభుత్వం విధివిధానాలు నచ్చకపోవడం గ్రామంలో అభివృద్ధి పనులు నిలిచిపోవడంతో తాము టీడీపీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ, పాతూరి శ్రీనివాసరావు, వేంపాటి ప్రసాద్, మొరంపూడి ప్రసాద్, కుర్రా సుబ్రహ్మణ్యేశ్వర వరప్రసాద్, గారపాటి బుజ్జియ్య, రాయంకుల చక్రధర్‌రావు, ముసునూరి రాము, గారపాటి బుజ్జియ్య, మాదాసు కృష్ణ, కొత్తూరి నాగమణి, నాగబాబు,మాజీ జడ్పీటీసీ గుత్తా సత్యసాయివరప్రసాద్, భారతి, టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్రాన్ని కాపాడుకుందాం : ధర్మరాజు

### జనసేన, టీడీపీ, బీజేపీ శ్రేణులతో పాదయాత్ర

గణపవరం / నిడమర్రు, మార్చి 28: రాష్ట్రాన్ని కాపాడాల్సిన బాధ్యత జనసేన, టీడీపీ, బీజేపీపై ఉందని జనసేన ఉమ్మడి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. మొయ్యేరులో పుంతల ముసలమ్మ ఆలయం నుంచి గురువారం పాదయాత్ర చేపట్టారు. మొయ్యేరు నుంచి ప్రారంభమైన పాదయాత్ర ముప్పర్తి పాడు, వెంకట్రాజపురం, పిప్పర, ముగ్గళ్ళ, అర్ధవరం, వరదరాజపురం మీదుగా గణపవరం చేరుకుంది. గ్రామాల్లోని యువత పూల వర్షం కురిపించగా, మహిళలు హారతులతో స్వాగతం పలికారు. కల్లుగీత కార్మికులు ఇటుకబట్టీల కార్మికులు, రైతులు, చిరు వ్యాపారులు పాదయాత్రకు స్వాగతం పలికి ధర్మరాజుకు వెతలను మొరపెట్టుకున్నారు. పోలవరం, ముగ్గళ్ళ, గణపవరం గ్రామాల్లో పెద్ద ఎత్తున కండువాలు కప్పి జనసేన పార్టీలోకి ఆహ్వానించారు. సాయంత్రం 5 గంటలకు నిడమర్రు మండలం భువనపల్లిలోకి పాదయాత్ర ప్రవేశించింది. టీడీపీ, జనసేన కార్యకర్తలు మహిళలు స్వాగతం పలికారు. పాదయాత్ర మందలపర్రు మీదుగా నిడమర్రు చేరింది. బాలవెంకటేశ్వరస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి రాత్రి ఆలయం ప్రాంగణంలో బస చేశారు. శుక్రవారం పాదయాత్ర కొనసాగుతుందని తెలిపారు. ఇందుకూరి రామకృష్ణంరాజు, తోట శ్రీనివాసరావు, గన్ని నాగగోపాలరావు, అద్దేపల్లి వాసురాజు, కూసంపూడి సురేంద్రకుమార్ రాజు, కాపారం చిన్న, యాళ్ల సుబ్బారావు, కానుమిల్లి చంటి, భీమవరపు ఏసురాజు, పొత్తూరి రామకృష్ణంరాజు, వంగా రఘు, నరసింహరాజు, నిమ్మల దొరబాబు, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్రలో అభివాదం చేస్తున్న కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మరాజు

# ఎన్నికల ఖర్చు లెక్క చెప్పాలి



ఉప్పాకపాడులో పోలింగ్ కేంద్రాలు పరిశీలిస్తున్న అధికారులు

ఉంగుటూరు, మార్చి 28: రాజకీయ పార్టీలు ఎన్నికల ఖర్చు లెక్క చూపాలని అధికారులు తెలిపారు. ఏప్రిల్ 18 వరకు రాజకీయ పార్టీల ఖర్చులు, ఏప్రిల్ 18 నుంచి అభ్యర్థి ఖాతాలో ఎన్నికల ఖర్చు రాయాల్సి ఉంటుందని ఎన్నికల పరిశీలకులు కేకేఎస్.మూర్తి, ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఉంగుటూరు రిటర్నింగ్ అధికారి వారి కార్యాలయంలో గురువారం రాజకీయ పార్టీల నేతలో సమావేశం ఏర్పాటుచేసి ఎన్నికల ఖర్చుపై ఆరా తీశారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు నాయకులకు వివరించారు. ప్రార్థనా మందిరాలలో రాజకీయ ప్రచారం చేస్తే కేసు నమోదు చేస్తామని ఆర్వో ఖాజావలి హెచ్చరించారు. భీమడోల సీఐ బి.భీమేశ్వర రవి కుమార్ మాట్లాడుతూ సభలు, సమావేశాలు, ర్యాలీ, ప్రచారానికి అనుమతి తీసుకోవాలని సూచించారు. యెలిశెట్టి పాపారావు బాబ్జి, వెజ్జు వెంకటేశ్వరరావు, ఉండవల్లి బాలానందం, గుత్తికొండ వెంకట కృష్ణారావు, పాతపాటి హరి కుమార్ రాజు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.

ఉప్పాకపాడులోని 35, 36 పోలింగ్ కేంద్రాలను డీటీ పోతురాజు, సెక్టార్ అధికారి కాంద్రేగుల శ్రీనివాసరావు పరిశీలించారు. 85 ఏళ్ల వయసు పైబడిన, దివ్యాంగుల వివరాలు తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాలలో సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. వీఆర్వో రమణ, కార్యదర్శి ఝాన్సీ పాల్గొన్నారు.

### సీవిజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయండి

జంగారెడ్డిగూడెం: ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై సి విజిల్ యాప్ ద్వారా పిర్యాదు చేయవచ్చని తహసీల్దార్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి స్లీవజోజి తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ అనుమతి లేకుండా ర్యాలీలు ప్రచారాలు నిర్వహించినా, ఎన్నికల సందర్భంగా డబ్బు, బహుమతులు పంచినా, మతపరమైన, కులపరమైన వ్యాఖ్యలు, ఎన్నికల నియమావళి ఉల్లంఘనలు సి విజిల్ యాప్ ద్వారా రెండు నిమిషాల నిడివి గల వీడియో తీసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. సంబంధిత అధికారులు పరిశీలించి కేసు నమోదు చేస్తారని తెలిపారు. ఫిర్యాదుదారు తమ పేరు తెలియకూడదనుకుంటే సి విజిల్ యాప్ డౌన్ లోడ్ చేసేముందు పేరు నెంబర్ ఇవ్వకుండా యాప్‌ను వినియోగించుకోవచ్చని తెలిపారు. ఆయనతో పాటు ఎంపీడీవో ప్రసాద్ ఉన్నారు.

● భీమడోలు: మండలంలోని పలు సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను రిటర్నింగ్ అధికారి ఖాజావలి పరిశీలించారు. ఆగడాలలంక, చెట్టున్నపాడు, గుండుగొలను, వడ్లపట్ల, అంబర్‌పేట గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. బూత్ లెవెల్ అధికారులు, సెక్టార్ అధికారులు, ఎస్‌హెచ్‌వోలు, తహసీల్దార్ వివరాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించామని, స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తహసీల్దార్ వరహాలయ్య, ఎంపీడీవో స్వర్ణలత, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

### ఫిర్యాదుల పరిష్కారం పై ఆర్వో ఖాజావలీకి ప్రశంస

ఉంగుటూరు: సి విజిల్, నిబంధనల ఉల్లంఘన ఫిర్యాదుల పరిష్కారంలో ఆర్వో, ఏలూరు ఆర్డీవో ఖాజావలిని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ ప్రశంసించారు. ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్‌లో ఉంగుటూరు నియోజకవర్గంలో మంచి చొరవ చూపడం అభినందనీయమన్నారు.

## ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ తనిఖీలు ముమ్మరం చేయాలి : కలెక్టర్

ఏలూరు సిటీ, మార్చి 28: ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదులు స్వీకరించేందుకు ఎన్నికల కమిషన్ ప్రవేశపెట్టిన సి-విజిల్ యాప్‌పై విస్తృత అవగాహన కల్పించాలని రిటర్నింగ్ అధికారులకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు సీ-విజిల్, ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలపై గురువారం ఆర్వోలు, నోడల్ అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. సి-విజిల్ యాప్‌పై ప్రజల్లో మరింత అవగాహన కల్పించే బ్యానర్లు ఏర్పాటు చేయాలన్నారు. సీజర్ మేనేజ్‌మెంట్‌లో ఉంగుటూరు నియోజకవర్గంలో మంచి చొరవ చూపడం పట్ల ఉంగుటూరు నియోజవర్గ ఆర్వో ఎస్ఎస్‌కే ఖాజావలిని కలెక్టర్ అభినందించారు. ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి మరింత కట్టుదిట్టమైన నిఘా, తనిఖీలను ముమ్మరం చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్ఠంగా అమలు పరిచే కార్యక్రమంలో భాగంగా స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్‌లు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు తనిఖీలను ముమ్మరం చేయాల న్నారు. సువిధ, ఎన్‌కోర్ పోర్టల్ ద్వారా అందిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి సకాలంలో అనుమతులను మంజూరు చేయాలన్నారు. నియోజకవర్గాల వారీగా పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. టెలికాన్ఫరెన్స్‌లో జేసీ లావణ్యవేణి, డీఆర్వో డి.పుష్పమణి, తదితరులు పాల్గొన్నారు.

## రెండేళ్లుగా కాంట్రాక్టు ఉద్యోగులకు వేతనాలు లేవు

పోలవరం, మార్చి 28: రెండేళ్లుగా తమకు జీతాలు ఇవ్వడం లేదని కొవ్వాడ కాలువ రిజర్వాయర్ కాంట్రాక్టు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. 2004లో కొవ్వాడ కాలువ రిజర్వాయర్ నిర్మించారని, అప్పటి నుంచి వాచ్‌మెన్‌గా పని చేస్తున్నానని కరకపాడు గ్రామానికి చెందిన కొండపల్లి సోమరాజు తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఇద్దరు లస్కర్లు రెండేళ్లుగా అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నామన్నారు. రెక్కాడితే గానీ డొక్క నిండని తమకు జీతాలు వెంటనే అందేలా చేయాలని కాంట్రాక్టు ఉద్యోగులు వాచ్‌మెన్ కొండపల్లి సోమరాజు, ఎలక్ట్రీషియన్ కోరుతున్నారు.

### ఎన్నికల నియమావళిపై అప్రమత్తంగా ఉండాలి

లింగపాలెం, మార్చి 28: అంగన్‌వాడీ సిబ్బంది ఎన్నికల నియమావళిపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో వి.రాంబాబు అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ సిబ్బందికి నిబంధనలు వివరించారు. ఎన్నికల నియమావళిని అతిక్రమించిన వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుమారి, పలువురు అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## దంత వైద్య విద్యార్థినికి జాతీయ స్థాయి బహుమతి

పెదవేగి, మార్చి 28: ఇండియన్ సొసైటీ ఆఫ్ పెరియో డోంటాలజీ పోస్ట్ గ్రాడ్యుయేషన్ కాన్ఫరెన్స్, శాస్త్రీయ పేపర్, పోస్టర్ ప్రదర్శనలో పెదవేగి మండలం దుగ్గిరాలలోని సెయింట్ జోసెఫ్ దంతవైద్య కళాశాల విద్యార్థిని ప్రతిభతో ప్రథమ స్థానంలో నిలిచింది. జాతీయ స్థాయిలో బహుమతులు అందుకుంది. దేశంలోని అన్ని దంత వైద్య కళాశాలలు పాల్గొన్న కార్యక్రమంలో సెయింట్ జోసెఫ్ దంతవైద్య కళాశాలలో పీజీ రెండో సంవత్సరం చదువుతున్న కొండేపాటి మౌనీష శాస్త్రీయ పేపర్ ప్రదర్శనలో విజేతగా నిలిచి జాతీయస్థాయి బహుమతి అందుకుంది. సెయింట్ జోసెఫ్ దంత వైద్య కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్, మౌనీషను అభినందించారు. ఫాదర్ మోజెస్ మాట్లాడుతూ జాతీయస్థాయిలో బహుమతి అందుకోవడం అనేది విద్యార్థి ప్రతిభకు నిదర్శనమన్నారు. ఈ అవార్డుతో కళాశాల స్థాయి మరింత పెరిగిందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ్, పెరియో డోంటాలజీ విభాగాధిపతి డాక్టర్ పి.అరవింద్‌కుమార్, డాక్టర్ పి.హరిష్ ప్రభుదేవ్, సిబ్బంది పాల్గొన్నారు.



జీలుగుమిల్లి చెక్‌పోస్టులో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్‌ఈబీ ఏఎస్పీ



కె.కోటలో వైసీపీ వ్యాన్ తనిఖీ చేస్తున్న తడికలపూడి పోలీసులు

## ఎన్నికల విధులు సక్రమంగా నిర్వర్తించాలి : ఎస్‌ఈబీ ఏఎస్పీ

జీలుగుమిల్లి, మార్చి 28 : ఆంధ్ర-తెలంగాణ సరిహద్దు చెక్‌పోస్టు ఎస్‌ఈబీ ఏఎస్పీ నక్కా సూర్యచందరావు గురువారం స్వయంగా వాహనాలు తనిఖీ చేశారు. ఎన్నికల నేపథ్యంలో రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలు సాగించే వాహనాల్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. సిబ్బంది విధులు సక్రమంగా నిర్వర్తించాలని, వాహనాల తనిఖీ సమయంలో ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. వాహనదారులతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలన్నారు. రూ.50వేలు మించి నగదు ఉంటే కేసులు నమోదు చెయ్యాలన్నారు. మద్యం, సారా, గంజాయి తరలిస్తున్న అనుమానం ఉంటే ఆంధ్ర నుంచి తెలంగాణ వెళ్లే వాహనాల్ని సైతం తనిఖీ చెయ్యాలన్నారు. ప్రచారం కోసం ఓటర్లను ప్రలోబ పెట్టేందుకు వినియోగించే ఎన్నికల సామగ్రి తరలిపోకుండా చూడాలన్నారు. 24 గంటల పాటు సిబ్బంది నిఘా ఉంచాలన్నారు. రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంత గిరిజన గ్రామాలపై మొబైల్ బృందం నిఘా ఉంచామన్నారు. జంగారెడ్డిగూడెం ఎస్‌ఈబీ సీఐ వై.పట్టాబిచౌదరి, ఎస్సైలు శేఖర్‌బాబు, ఎలైజర్ సిబ్బంది ఉన్నారు.

● కామవరపుకోట: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కొత్తూరు నాలుగు రోడ్ల కూడలిలో ఎన్నికల అధికారి ఎం.డి.మొహిద్దీన్, తడికలపూడి పోలీసులు రామకృష్ణ, అశోక్, సీఆర్‌ఎఫ్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ఈ మార్గంలో వెళుతున్న తెనాలి ఎమ్మెల్యే కన్నావత్తుల శివకుమార్, ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, వైసీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్, చింతలపూడి వైసీపీ అభ్యర్థి కంభం విజయరాజు, మాజీ జడ్పీటీసీ ఘంటా సుధీర్‌బాబు వాహనాలను అధికారులు తనిఖీ చేశారు. వైసీపీ ప్రచార వ్యానును సమగ్రంగా పరిశీలించారు.



నారా భువనేశ్వరికి జ్ఞాపికను అందజేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

## భువనేశ్వరికి నూకాలమ్మ ఆలయ కమిటీ సత్కారం

జంగారెడ్డిగూడెం, మార్చి 28: చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరిని నూకాలమ్మ ఆలయ కమిటీ సత్కరించింది. నిజం గెలవాలి కార్యక్రమంలో జంగారెడ్డిగూడెంలో పర్యటించిన ఆమెను టీడీపీ, జనసేన నాయకులు కలుసుకున్నారు. నూకాలమ్మ దేవస్థానం చైర్మన్ రాజాన సత్యనారాయణ, కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి శేష వస్త్రం, రూపక పటాన్ని ఇచ్చి దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఆమెను కలసిన వారిలో నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్‌చంద్రశేషు, మండవ లక్ష్మణరావు, షేక్ ముస్తఫా, పెనుమర్తి రామ్‌కుమార్, కరుటూరి రమాదేవి, చిటికెన రాంబాబు తదితరులు ఉన్నారు.

## ఓటుతో వైసీపీని తరిమికొట్టాలి

ఏలూరు టూటౌన్, మార్చి 28: రాష్ట్ర ప్రజలు ఓటుతో వైసీపీని తరిమికొట్టాలని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జాలా బాలాజీ అన్నారు. 3వ డివిజన్ టీడీపీ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో అవినీతి, అరాచకాలు తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. అధిక ధరలతో సామాన్య ప్రజలను అప్పుల ఊబిలోకి దించారన్నారు. యువతకు మత్తుపదార్థాలు అలవాటు చేసి భవిష్యత్తు నాశనం చేస్తున్నారని అన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని గెలిపించాలన్నారు. జాలా సుమతి, షేక్ రిజ్వాన, సుల్తాన బేగం, సీహెచ్. వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

## కె.కోటలో వైసీపీకి పలువురు గుడ్ బై



రాజీనామా లేఖ ఇస్తున్న వైసీపీ నాయకులు

కామవరపుకోట, మార్చి 28: వైసీపీ విధానాలను వ్యతిరేకిస్తూ మండలంలోని పలు గ్రామాల నాయకులు పార్టీకి, సభ్యత్వానికి రాజీనామా చేశారు. వైసీపీ మండల అధ్యక్షుడు మిడతా రమేష్‌బాబుకు గురువారం రాజీనామా పత్రాన్ని అందజేశారు. ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి, జడ్పీటీసీ కడిమి రమేష్, మేడూరి రంగబాబు, బొల్లు సత్యనారాయణ, వైస్ ఎంపీపీ తమ్మిశెట్టి గిరిజ, ముదురాజు కార్పొరేషన్ డైరెక్టర్ చిక్కుళ్ళ కొండ, సొసైటీ చైర్‌పర్సన్ సాయన కనకరాజు వైసీపీ అధిష్ఠానం విధానాలపై నిరస తెలిపారు. పార్టీ వైఖరి నచ్చక రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు.

## ఎన్నికల నియమావళి అమలులో నిర్లక్ష్యం

పెదవేగి, మార్చి 28: ఎన్నికల నియమావళి అమలులో అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. గ్రామాల్లో రాజకీయ నేతల బోర్డులపై సమాచారం ఉంటేనే తొలగిస్తున్నారు. చక్రాయగూడెం సమీపంలో రహదారి పక్కన ఎంపీపీ, ఎమ్మెల్యే, సీఎం జగన్‌తో కూడిన బోర్డు తాడిచెట్టుకు వేలాడదీశారు. కోడ్ అమలులోకి వచ్చిన నాటి నుంచి అధికారులు దానిని తొలగించలేదు. గురువారం సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేయడంతో మధ్యాహ్నానికి ఆ బోర్డు (హోర్డింగ్)ను తొలగించారు. ఎవరైనా చెబితేనే అధికారులు స్పందిస్తున్నారి పలువురు విస్మయం వ్యక్తం చేశారు.

## మద్యం అక్రమ రవాణాను నిరోధించండి

చింతలపూడి, మార్చి 28: చింతలపూడి సర్కిల్ పరిధిలో సారాతయారీ, మద్యం అక్రమ రవాణా, విక్రయాలను అరికట్టాలని ఎస్‌ఈబీ సూపరింటెండెంట్ కె.రామకృష్ణ సిబ్బందికి సూచించారు. సర్కిల్ కార్యాలయంలో వివిధ కేసుల్లో పట్టుబడిన మద్యం, సారాను గురువారం ధ్వంసం చేశారు. 64 కేసుల్లో పట్టుబడిన సారా 935 లీటర్లు, 45 కేసుల్లో పట్టుబడిన 380 లీటర్ల మద్యాన్ని ధ్వంసం చేశారు. సరిహద్దు చెక్‌పోస్టులలో ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న అక్రమ మద్యం రవాణాను అరికట్టాలన్నారు. అల్లిపల్లి, లింగగూడెం, లంకాలపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఎక్సైజ్ చెక్‌పోస్టులను తనిఖీ చేశారు.

## జంగారెడ్డిగూడెం బార్ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

జంగారెడ్డిగూడెం, మార్చి 28: జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ముళ్ళపూడి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులు వైసుగుణకుమారి, ప్రధాన కార్యదర్శి .విత్తనాల రాజు, సహాయ కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ ఎస్.ఆనంద్, కోశాధికారి పి.పెద్దిరాజు, కార్యదర్శి దాకరపు ప్రసాద్, మహిళా కార్యదర్శి కట్టా రాజీవ్ కుమారి ఎన్నికయ్యారు.

## సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు కార్పొరేషన్ :** సత్రంపాడు లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.
- **బుట్టాయగూడెం :** రెడ్డిగణపవరం కనకదుర్గ అన్నపూర్ణ విశ్వేశ్వరస్వామి ఉత్సవాల్లో నాలుగో రోజు నాగభట్ల పద్మనాభశర్మ ఆధ్వర్యంలో మహాచండి యాగాన్ని నిర్వహించారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు ఆలయ ధర్మకర్త ధనుంజయరాజు తెలిపారు.
- **భీమడోలు :** జాతీయ రహదారిలో నిబంధనలకు విరుద్ధంగా నిల్వ ఉంచిన 500 లీటర్ల డీజిల్ ను సివిల్ సప్లైస్ అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. తాతబ్బాయ్ రాజు డీజిల్ నిల్వ ఉంచాడని సీఎస్ డీటీ మాధవరావు కేసు నమోదు చేశారు.



గుంతలు పడిన గుర్వాయిపాలెం- పెదలంక రోడ్డు



కంకరపైకి లేచిన కలిదిండి - పోతుమర్రు రోడ్డు

# రహదారులు గోతులమయం

కలిదిండి, మార్చి 28 : మండలంలోని రహదారులు భారీ గోతులు పడి అధ్వానంగా మారాయి. అప్పుడప్పుడు తాత్కాలిక మరమ్మతులు చేసి చేతులు దులుపుకోవటం తప్ప ఐదేళ్లలో ఈ ప్రభుత్వం పూర్తిస్థాయిలో రోడ్డు వేసిన దాఖలాలు లేవు. గుర్వాయిపాలెం నుంచి పెదలంక వెళ్లే రహదారి భారీ గోతులు పడ్డాయి. ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. మద్వానిగూడెం నుంచి మట్టగుంట ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి సుమారు తొమ్మిది కిలోమీటర్ల మేర గుంతలు పడడంతో వాహనాలు గుంతల్లో ఇరుక్కుంటున్నాయి. ట్రాఫిక్ స్తంభించిపోతోంది. కాళ్లపాలెం-తాడినాడ ప్రధాన రహదారిలో గోతులు, చినతాడినాడ వయా పోతుమర్రు, కలిదిండి రహదారి గోతులు పడి కంకరపైకి లేచిపోయింది. కలిదిండి నుంచి కోరుకొల్లు ప్రధాన రహదారిలో గుంతలు పడ్డాయి. ఈ ఐదేళ్లలో రహదారుల అభివృద్ధిని పట్టించుకోని ప్రజాప్ర తినిధులు ఎన్నికలు వస్తుండడంతో గుర్వాయిపాలెం- పెదలంక రోడ్డు, కలిదిండి-వడాలి ప్రధాన రహదారుల మరమ్మతులను హడావుడిగా శంకుస్థాపనలు చేశారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి అధ్వానంగా ఉన్న రహదారులకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## ఆలిండియా బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ ప్రారంభం



ఇండియన్ బ్యాంక్ చెన్నై, కేరళ ఎలక్ట్రిసిటీ బోర్డుల మధ్య పోటీ

నూజివీడు, మార్చి 28 : బొబ్బిలి కొండలరావు మెమోరియల్ ఆల్ ఇండియా ఇన్విటేషన్ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌ను గురువారం లాంఛనంగా ప్రారంభించారు. నూజివీడు డీఏఆర్ కళాశాలలో చైర్మన్, నూజివీడు జమిందారి వారసులు ఎం.ఎం.ఆర్.వి అప్పారావు టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌కు మొత్తం ఆరుజట్లు హాజరయ్యాయి. ఇండియన్ బ్యాంక్ చెన్నై, కేరళ స్టేట్, ఎలక్ట్రిసిటీ బోర్డు, ఇండియన్ నేవీ, ఇండియన్ ఆర్మీ, జెయిన్ యూనివర్శిటీ బెంగళూరు, ఆంధ్రప్రదేశ్ జట్లు పాల్గొనగా, మొదటి మ్యాచ్ ఇండియన్ బ్యాంకు చెన్నై, కేరళ స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డుల మధ్య ప్రారంభమైంది. ఈ మ్యాచ్‌లో 65-49 స్కోరుతో ఇండియన్ బ్యాంకు చెన్నై జట్టు విజయం సాధించింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ జి.చక్రవర్తి, కృష్ణా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జీకే బోస్, నూజివీడు మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ రామిశెట్టి మురళీకృష్ణ, డీఎస్పీ జి.లక్ష్మయ్య, ఆర్టీసీ డీఎం పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ దశిక వంశీ

కలిదిండి, మార్చి 28 : సమాజంలో నివశించే ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ దశిక వంశీ అన్నారు. గురువారం కోరుకొల్లు, ఆవకూరు, కొచ్చెర్ల గ్రామాల్లో సెక్టార్ అధికారులతో కలసి పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఓటు హక్కుపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవడం దేశ పౌరుల బాధ్యతగా భావించాలన్నారు. ఓటు హక్కుకు ఎవరైనా భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సెక్టార్ అధికారి విద్యాసాగర్, ఆర్‌ఐ విజయలక్ష్మి, వీఆర్వోలు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

## టెన్త్ సంస్కృత పరీక్షకు నూరుశాతం హాజరు

ముదినేపల్లి, మార్చి 28:పదో తరగతి సంస్కృతం పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. ముదినేపల్లి మండలంలోని పలు ప్రైవేట్ విద్యా సంస్థలకు చెందిన 111 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. ముదినేపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 50 మంది, జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 61 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఈ పరీక్షకు నూరుశాతం విద్యార్థులు హాజరు కావడం విశేషం. ఆయా పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు విజయ కుమార్, ఉదయ భాస్కర్ పర్యవేక్షణలో సంస్కృత సబ్జెక్టు పరీక్షలు జరిగాయి.

## గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేస్తా..

ఆగిరిపల్లి, మార్చి 28: తనకు అవకాశమిస్తే వచ్చే ఐదేళ్లలో గ్రామీణ పాంతాలను అభివృద్ధి చేస్తానని ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. ఆగిరిపల్లి మండలం ఈదులగూడెం గ్రామంలో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఏ నాయకుడు బాధ్యతగా పనిచేస్తారో ప్రజలు బేరీజు వేసుకోవాలని గత మూడుదఫాలుగా పాలన ఏ విధంగా సాగిందో గ్రామీణ ప్రాంత రోడ్లుచూస్తే తెలుస్తాయన్నారు. పార్టీలకు అతీతంగా గన్నవరంలో గెలిచి అభివృద్ధి చేసిన ఘనత తనదన్నారు.

## క్రైం కార్నర్

### ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్ల పట్టివేత

» ఒక్కొక్క ట్రాక్టర్‌కు రూ.5 వేలు జరిమానా



పోలీసుల స్వాధీనంలో ఉన్న ఇసుక ట్రాక్టర్లు

ముసునూరు, మార్చి 28: మండలంలోని బలివే తమ్మిలేరు నుంచి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్‌లను గురువారం తెల్లవారుజామున ముసునూరు పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. బలివే గ్రామానికి చెందిన గుండుబోయిన నాగేంద్రరావు, పలగాని దుర్గారావు, దిమ్మెట శ్రీనివాసరావు, జెట్టి శ్రీనివాసరావు తమ ట్రాక్టర్‌లతో అనుమతులు లేకుండా తమ్మిలేరులోని ఇసుకను లోడ్ చేసుకుని నూజివీడువైపు తరలిస్తుండగా పట్టుకున్నట్టు ఎస్‌ఐ పి.వాసు తెలిపారు. నాలుగు ట్రాక్టర్లను ముసునూరు తహసీల్దార్ జవహర్‌బాబీకి రిఫర్ చేయగా ఒక్కొక్క ట్రాక్టర్‌కు రూ.5వేలు చొప్పున నాలుగు ట్రాక్టర్లకు రూ.20వేలు జరిమానా విధించారని ఎస్‌ఐ తెలిపారు.

### నాటు తుపాకీ కలిగిన వ్యక్తి అరెస్టు



కలిదిండి, మార్చి 28 : నాటు తుపాకీ కలిగిన వ్యక్తిని పోలీసులు గురువారం అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. కోరుకొల్లు సెంటర్‌లో నెల్లూరు జిల్లా గూడూరుకు చెందిన నక్కల ఏడుకొండలు లైసెన్స్ లేని నాటు తుపాకీతో సంచరిస్తుండగా ఎస్‌ఐ ప్రియకుమార్ పోలీసు సిబ్బంది మధ్యవర్తులను వెంట బెట్టుకుని వెళ్లి అరెస్టు చేసి నాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నారు.

### మద్యం విక్రయదారుడి అరెస్ట్

ముసునూరు, మార్చి 28: కాట్రేనిపాడు గ్రామంలో అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని గురువారం కేసునమోదు చేశారు. గ్రామంలో లాము పరుశురాముడు అనేవ్యక్తి ప్రభుత్వ దుకాణం నుంచి ఎక్కువ మద్యంసీసాలను కొనుగోలుచేసి ఇంటివద్ద అధికరేట్లకు అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తుండగా దాడిచేసి పట్టుకున్నట్టు ఎస్‌ఐ పి.వాసు తెలిపారు. దాడిలో నిందితుడిని అదుపులోకి తీసుకుని అతడి వద్ద నుంచి రూ.2,500 విలువగల పది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. నిందితుడిని నూజివీడు కోర్టులో హాజరుపర్చగా జడ్జి రిమాండ్ విధించినట్లు తెలిపారు.



ముదినేపల్లిలో మాట్లాడుతున్న కొడాలి వినోద్, నూజివీడులో భవన నిర్మాణ కార్మికులతో కొలుసు పార్థసారథి, కామినేనికి కలిదిండి టీడీపీ నాయకుల అభినందనలు

# భవన కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

నూజివీడు, మార్చి 28: భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతానని నూజివీడు టీడీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. గురువారం నూజివీడు పట్టణంలో భవననిర్మాణ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు తోటా వెంకట్రావు, సెక్రటరీ వాకా రాంబాబు తదితరులు ఆయనను కలసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మికుల స్థితిగతులను సంఘ సభ్యులనుంచి అడిగి తెలుసుకున్నారు. అనుభవలేమితో ఇసుకపాలసీ మార్పు అంటూ కార్మికుల కుటుంబాలను పస్తులు ఉండేలా చేసిన జగన్‌రెడ్డి తిరిగి అధికారంలోకి వస్తే కార్మికులు మరిన్ని బాధలు పడాల్సి వస్తోందన్నారు. చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో నూజివీడు నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకులు నూతక్కి వేణుగోపాలరావు, యూనియన్ ట్రెజరర్ డి.నాగేంద్రరావు, మాజీ కార్యదర్శి ఎస్‌కే బాజి, కమిటీ సభ్యులు నాయుడు రత్నం, పల్నాటి వెంకటేశ్వరరావు, ఎస్‌కే షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ సిద్ధాంతాలే శిరోధార్యం : కొడాలి వినోద్

ముదినేపల్లి, మార్చి 28 : పార్టీ అజెండా, సిద్ధాంతాలకు కట్టుబడి తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు వ్యవహరించాల్సిన అవసరం ఉందని టీడీపీ కైకలూరు నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జి కొడాలి వినోద్ అన్నారు. పొత్తులో భాగంగా నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి కామినేని శ్రీనివాస్‌ను ప్రకటించిన అనంతరం టీడీపీ నాయకులు, కార్యకర్తలు గురువారం ముదినేపల్లిలోని కొడాలి వినోద్ నివాసం వద్ద సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులు, ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. ముదినేపల్లి మండలంతోపాటు మండవల్లి తదితర ప్రాంతాల టీడీపీ కార్యకర్తలు పాల్గొన్న సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ నిర్ణయమే శిరోధార్యంగా కార్యకర్తలు పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. రెండు రోజుల్లో పార్టీ జాతీయ కార్యదర్శి లోకేశ్‌ను కలసి అన్ని అంశాలపై చర్చించిన అనంతరం నియోజకవర్గంలో అనుసరించాల్సిన విధానంపై నిర్ణయం తీసుకుందామని కార్యకర్తలకు సూచించారు. భవిష్యత్తులో టీడీపీ కార్యకర్తలకు న్యాయం జరిగే విధంగానే చూస్తామన్నారు. సమావేశంలో సర్పంచ్‌లు పరసా విశ్వేశ్వరరావు, జాస్తి రాజా, దారం సుధ, నాయకులు పల్లెం ఏడుకొండలు, జోసెఫ్ తంబి, పంతగాని సురేష్ తదిరతులు పాల్గొన్నారు.

## నూజివీడు టీడీపీ అభ్యర్థి కొలుసు పార్థసారథి

## కోలాహలంగా కామినేని శ్రీనివాస్ గృహం

» కూటమిలో చేరిన వైసీపీ నేత బూరుబోయిన శ్రీనివాసరావు



కామినేని సమక్షంలో కూటమిలో చేరిన వైసీపీ నేత శ్రీనివాసరావు

కైకలూరు/కలిదిండి/ ముదినేప ల్లి, మార్చి 28: మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్‌ను కైకలూరు నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా ప్రకటించడంతో గురువారం ఉదయం నుంచి కైకలూరు రూరల్ వరహాపట్నం లోని ఆయన ఇంటి వద్ద అభిమానుల తాకిడి పెద్దఎత్తున నెలకొంది. నియోజకవర్గంలోని అన్నిగ్రామాల నుంచి అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చి పూలదండలతో ఆయన్ను ముంచెత్తారు. వైసీపీ నాయకుడు బూరుబోయిన శ్రీనివాసరావు తన అభిమానులతో కలిసి డాక్టర్ కామినేని శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ సమక్షంలో ఎన్డీయే కూటమిలో చేరారు. ఇప్పటివరకు వైసీపీలో పనిచేసి కూటమిలో చేరడంపట్ల కామినేని అభినందించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొత్త నాగేంద్రకుమార్ మాట్లాడుతూ కామినేనిని, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌ను గెలిపించుకుందామన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి కామినేని శ్రీనివాస్‌ను కలిదిండి మండల టీడీపీ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్‌చౌదరి, మాజీ జడ్పీటీసీ నున్న రమాదేవి, నాయకులు అండ్రాజు శ్రీనివాస్, భోగేశ్వరరావు, అక్కల బోసు, కురెళ్ల ఏడుకొండలు, నున్న సుబ్రహ్మణ్యం, లంకా రత్నారావు పాల్గొన్నారు. ముదినేపల్లి మండలంలో శ్రీనివాస్ ఎంపిక పట్ల బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు, ఓబీసీ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు మొవ్వ ఫణీంద్ర, ముదినేపల్లి మండల పార్టీ అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మి, నాయకులు వత్తుమిల్లి ప్రసాద్, రెడ్డి నాగలక్ష్మి, యర్రా నాని తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

## సుస్థిర పాలన కోసం కూటమి అభ్యర్థులను గెలిపించాలి

ఏలూరు టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి పుట్టా మహేష్

కైకలూరు, మార్చి 28: రాష్ట్రంలో సుస్థిరమైన పరిపాలన అందించేందుకు కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్‌యాదవ్ అన్నారు. గురువారం కైకలూరు మండలం వరహాపట్నంలో నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్‌తో కలిసి ఆయన స్వగృహంలో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. పుట్టా మహేష్‌యాదవ్ మాట్లాడుతూ పొత్తుల్లో భాగంగా ఏ టిక్కెట్ ఎవరికి ఇచ్చినా కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలని, ఎప్పుడూ స్థానికంగా అందుబాటులో ఉండి ప్రజలకు సేవలందించాలనే లక్ష్యంతోనే ఎన్నికల బరిలో పోటీ చేస్తున్నానన్నారు. మా నాన్న పుట్టా సుధాకర్‌యాదవ్ టీడీపీ స్థాపించిన నాటి నుంచి టీడీపీలోనే పనిచేశారని టీటీడీ చైర్మన్‌గా పనిచేశారని ఆయన ప్రజాసేవ, ఆశయాలకు అనుగుణంగా పైకి వచ్చామని ఎంతోమందికి సేవచేస్తే ప్రజల మన్ననలను పొందుతున్నామని అదే సంకల్పంతో ఏలూరు పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్టు తెలిపారు. మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ ఏలూరు పార్లమెంట్‌లోని ఏడు నియోజకవర్గాల్లో కైకలూరు నుంచి పార్లమెంట్ అభ్యర్థికి అత్యధిక ఓట్ల మెజార్టీ తీసుకువస్తామన్నారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు దుష్ప్రచారాలను నమ్మవద్దని ప్రజల పట్ల నిష్పక్షపాతంగా పనిచేస్తానని మంత్రిగా రాష్ట్రమంతా తిరుగుతున్నా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన ఘనత తనదేనన్నారు. ఈ సందర్భంగా అభిమానులు వారిద్దరిని గజమాలతో సత్కరించారు. టీడీపీ నాయకులు టీకేఎం నాని, వల్లభనేని శ్రీనివాసచౌదరి, బలే ఏసురాజు, నున్న రమాదేవి, గంగుల శ్రీదేవి, జనసేన నాయకులు కొల్లి వరప్రసాద్, తోట లక్ష్మి, పూల రామచంద్రరావు, మాజీ ఎంపీపీ నర్సిపల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

### టీడీపీ ముఖ్య నాయకులతో మహేష్ సమావేశం

టీడీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థిగా మహేష్‌కుమార్‌యాదవ్‌ను ప్రకటించిన తరువాత తొలిసారిగా ఆయన కైకలూరు వచ్చారు. కైకలూరు టీడీపీ కార్యాలయంలో కొంతమంది ముఖ్యనాయకులను కలిసి పరిచయం చేసుకున్నారు. పార్టీ స్థితిగతులను ఎన్డీయే కూటమి గెలుపునకు కావాల్సిన విధానాలను నాయకులతో కలిసి చర్చించారు. గత ఎన్నికల్లో ఈ నియోజకవర్గ పరిస్థితులను స్థానిక నేతలు మహేష్‌కు వివరించారు.

## చెరువు అక్రమ తవ్వకాన్ని అడ్డుకున్న అధికారులు

» ఆరు ట్రాక్టర్లు, ఒక ఎక్స్‌కవేటర్ సీజ్



సీజ్ చేసిన ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్

ముదినేపల్లి రూరల్, మార్చి 28: అనుమతులు లేకుండా రాత్రికి రాత్రి గుట్టుచప్పుడు కాకుండా అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే అనుచరుడు చెరువు తవ్వకానికి శ్రీకారం చుట్టాడు. వణుదుర్రులో చెరువుతవ్వకాలకు ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకోకుండా అనధికారికంగా చేపలచెరువు తవ్వుతున్నారంటూ సోషల్ మీడియాలో వచ్చిన సమాచారం మేరకు బుధవారం అర్ధరాత్రి తహసీల్దార్ ఎస్.ఎల్.ఎమ్ కుమారి ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది చెరువుతవ్వకాన్ని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా చెరువు తవ్వకాలను నిలుపుదల చేయాలని లేనిపక్షంలో కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు. ఎమ్మెల్యే అనుచరుడు రెవెన్యూ సిబ్బందిపై ఒత్తిడి తీసుకువచ్చారు. ఎన్నికల నియమావళి అనుసరించి అనుమతులు లేకుండా తవ్వకాలు చేపట్టకూడదని తహసీల్దార్ తెల్పి చెప్పడంతో తవ్వకాన్ని నిలుపుదల చేశారు. తెల్లవారు జామున చెరువువద్ద ఉన్న ఆరు ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేశారు. అనంతరం తహసీల్దార్ ఎస్‌ఐ వెంకటకుమార్‌కు ఫోన్‌చేసి సీజ్‌చేసిన వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించాలని ఆదేశించడంతో వాహనాలను స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## సత్యసాయి సేవా సమితి సేవలు అభినందనీయం



దాతలను సత్కరిస్తున్న వైద్యాధికారి శ్రీనివాసరావు

కైకలూరు, మార్చి 28: దానాల్లో కంటే అన్నదానం మహోన్నతమైనదని రోగులకు నిర్విరామంగా భోజనం అందించడం సత్యసాయి సేవాసమితి సభ్యుల కృషి ఉన్నతమైనది అని సీహెచ్‌సీ వైద్యాధికారి ఎ.శ్రీనివాసరావు అన్నారు. గురువారం కైకలూరు ప్రభుత్వాసుపత్రిలో సత్యసాయి సేవాసమితి సభ్యులు ప్రతీ రోజూ ఆసుపత్రిలో రోగులకు అన్నదాన కార్యక్రమం ప్రారంభించి నేటికి ఏడాది పూర్తయిన సందర్భంగా దాతలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సమితి సభ్యులు మాట్లాడుతూ ప్రతినెలా కొల్లేటికోట ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించే రోజున అన్నదానం చేయడంతో పాటు సీమంతం కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అధిక మొత్తంలో ఎక్కువ సార్లు ఆర్థికంగా సహకారం అందించినవారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు వీరప్ప, కృష్ణమోహన్, గుర్రం శ్యాంకుమార్, సేవాదల్ కో-ఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, శ్రీలక్ష్మి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



వేల్పుచర్ల జడ్పీ పాఠశాలలో కోడిగుడ్లను పరిశీలిస్తున్న సోమశేఖర్

ముసునూరు, మార్చి 28:విద్యార్థులకు నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనాన్ని అందించాలని, మధ్యాహ్నం భోజన పథకంలో ఎటువంటి అవకతవకలకు పాల్పడినా కఠినచర్యలు తీసుకుంటామని జిల్లా సమగ్రశిక్షణ, అదనపు సమన్వయకర్త బి.సోమశేఖర్ హెచ్చరించారు. గురువారం వేల్పుచర్ల జడ్పీ పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మిడ్డేమీల్స్ ట్రైల్ అండ్ లైన్ టెస్ట్, నాడు-నేడు పనులు, స్కూల్ మెయింటినెన్స్ ఫండ్ వినియోగం తదితర వాటిని ఆయన పరిశీలించారు. మధ్యాహ్నం భోజనానికి సంబంధించిన ఆహారపదార్థాలు, కోడిగ్రుడ్లు తదితర వాటిని క్షుణంగా పరిశీలించి ఆహార నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజనాన్ని రుచిచూసిన ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ట్రైల్ అండ్ లైన్ టెస్ట్‌ను విద్యార్థులు రాస్తున్న తీరును పరిశీలించారు. నాడు-నేడు నిధులు, మెటీరియల్ అందుబాటులో ఉన్నా పనులు ఎందుకు నిదానంగా సాగుతున్నాయని ప్రశ్నించారు. పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. స్కూల్ మెయింటినెన్స్ ఫండ్‌తో పాఠశాలలో విద్యార్థులకు అవసరమయ్యే అన్ని అవసరాలను పూర్తి చేయాలని సూచించారు. పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్‌తోపాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బాబా మందిర్‌లో అన్నప్రసాదాలయం ప్రారంభం



బాబాకు పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ విఠలరావు దంపతులు

మండవల్లి, మార్చి 28: మండవల్లి గ్రామంలోని శ్రీదత్త పరంపర షిర్డీ సాయిబాబాకు వైభవంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మందిర ఆవరణలో నూతనంగా నిర్మించిన సాయి అన్నప్రసాదాలయం అర్చకుల వసతి గృహాన్ని ఆలయ కమిటీ నిర్వాహకులు గుడివాడ చిట్టిబాబు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు దంపతులు సాయిబాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు నూతన ప్రసాదాల ఆలయంలో అన్నసమారాధన నిర్వహించారు.

## గేదెల పోట్లాట.. దంపతులకు తీవ్రగాయాలు

చాట్రాయి, మార్చి 28: పోట్లాడుకుంటున్న గేదెలు ద్విచక్రవాహనంపై పడిదంపతులు తీవ్రంగా గాయపడిన ఘటన యర్రావారిగూడెంలో బుధవారం సాయంత్రం జరిగింది. చిన్నంపేటకు చెందిన తొమ్మండ్రు కృష్ణ, దేవమాత దంపతులు బైక్‌పై ఏలూరులోని బంధువుల ఇంటికి వెళుతుండగా గేదెలు పోట్లాడుకుంటూ వీరిపై పడి తొక్కివేశాయి. ఈ ప్రమాదంలో భర్తకు కాలు రెండు చోట్ల విరిగిపోగా, భార్యకు చెయ్యి విరిగింది. స్పందించిన స్థానికులు గాయపడిన దంపతులను 108లో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స అందిస్తున్నట్టు బంధువులు తెలిపారు.

## రంగస్థల కళాకారులకు సన్మానం



కళాకారులను సన్మానిస్తున్న దృశ్యం

నూజివీడు టౌన్, మార్చి 28 : ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని పురస్కరించుకుని రంగస్థల నటులకు సన్మాన కార్యక్రమాన్ని బుధవారం రాత్రి నిర్వహించారు. నూజివీడు కళావేదిక ఆధ్వర్యంలో శ్రీసత్య నృత్య సంగీత కళాశాలలో ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా ప్రముఖ నటులు, గాయకులు, నూజివీడు ఆర్టీసీ డిపో రిటైర్డ్ ఉద్యోగి గుజ్జుల చంద్రశేఖర్‌రావు తదితరులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సత్య నృత్య సంగీత కళాశాల ప్రిన్సిపాల్ వేంపాటి మోహన్, లయన్స్ క్లబ్ సభ్యులు పి.కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అడవినెక్కలంలో ఆర్డీవో తనిఖీలు

ఆగిరిపల్లి, మార్చి 28:అడవినెక్కలం గ్రామంలో నూజివీడు ఆర్డీవో భవానిశంకరి ఎన్నికల్లో భాగంగా గురువారం వాహనాలు తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఆగిరిపల్లి తహసీల్దార్ మృత్యుంజయరావు, పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రతివాహనాన్ని క్షుణంగా పరిశీలించి పంపించారు.

## ఆధ్యాత్మికం

### వైభవంగా సీతారామాంజనేయ ఆలయ శంకుస్థాపన

నూజివీడు టౌన్, మార్చి 28 : మిట్టగూడెం గ్రామంలో శ్రీనవ ఆంజనేయసహిత సీతారామాలయ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆగమ సలహాదారు మామిళ్ళపల్లి మృత్యుంజయప్రసాద్ సిద్ధాంతి ఆధ్వర్యంలో శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. గణపతిపూజ, పుణ్యాహవాచన, పంచగవ్యపూజ, హోమం తదితర కార్యక్రమాలతో పూర్ణాహుతి నిర్వహించారు. ఈ సందర్భంగా స్థలదాతలు మిర్యాల కనకభూషణరావు, సుభద్రాదేవి, గెల్లా లక్ష్మీనారాయణ, అనసూర్యాదేవి దంపతుల కుమారుల ఆధ్వర్యంలో హోమ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ శంకుస్థాపన కార్యక్రమాన్ని తపనా ఫౌండేషన్ చైర్మన్ తపనా చౌదరి, ప్రముఖ గేయరచయిత శ్రీరామ్, నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### ఘనంగా కోదండ రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ

నూజివీడు టౌన్, మార్చి 28: వెంకటాయపాలెంలో విజయ కోదండ రామాలయం పునఃనిర్మాణం, పునఃప్రతిష్ఠ మహోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన ఆలయ విగ్రహప్రతిష్ఠ, మహాకుంభ సంప్రోక్షణ కార్యక్రమానికి శ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజా జీయర్‌స్వామి ముఖ్యఅతిథిగా హాజరై వేదప్రవచన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహాపూర్ణాహుతి, సంప్రోక్షణ, ప్రధమారాధన, సీతారామ కల్యాణం, నివేదన, మంగళ నీరాజనం తదితర కార్యక్రమాలను ఆలయ నిర్వాహకులు వైభవంగా నిర్వహించారు.



మిట్టగూడెంలో పూజలు చేస్తున్న తపన చౌదరి, తదితరులు



వెంకటాయపాలెంలో వేద ప్రవచనం చేస్తున్న చినజీయర్‌స్వామి

## జనసేన రాజకీయ వ్యవహారాల సంయుక్త కార్యదర్శిగా లీలాకనకదుర్గ



పవన్ చేతులమీదుగా నియామక పత్రాన్ని అందుకుంటున్న కనకదుర్గ

కలిదిండి, మార్చి 28 : జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా కోరుకొల్లు సర్పంచ్ బట్టు లీలాకనకదుర్గ నియమితులయ్యారు. ఈ మేరకు జనసేన అధినేత పవన్‌కల్యాణ్ నియామకపు పత్రాన్ని మంగళగిరి పార్టీ కార్యాలయంలో ఆమెకు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనసేన పార్టీ బలోపేతానికి కూటమి అభ్యర్థుల విజయానికి తనవంతు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో కార్యదర్శిగా నియమించిన జనసేన అధినేత పవన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెకు కూటమి అభ్య ర్థి కామనేని శ్రీనివాస్, జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరిపురపు రాజబా బు, నాయకులు నల్లగోపుల చలపతిరావు, కొల్లి బాబ్జి, వలవల రమేష్, నున్న సుబ్రహ్మణ్యం, తోట రమాదేవి, తమనాల మహాలక్ష్మి అభినందనలు తెలిపారు.

## 'నిజం గెలవాలి'కి తరలిన చాట్రాయి టీడీపీ శ్రేణులు



నారా భువనేశ్వరితో టీడీపీ మండల అధ్యక్షురాలు బొట్టు వరలక్ష్మి

చాట్రాయి, మార్చి 28: నూజివీడు నియోజకవర్గం ఆగిరిపల్లి మండలంలో గురువారం జరిగిన భువనేశ్వరి నిజం గెలవాలి కార్యక్రమానికి చాట్రాయి మండలం నుంచి టీడీపీ శ్రేణులు తరలివెళ్లారు. పార్టీ మండల అధ్యక్షురాలు బొట్టు వరలక్ష్మి, పార్టీ జిల్లా అధికార ప్రతినిది మందపాటి బసవారెడ్డి, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, మండల నాయకులు బొట్టు లక్ష్మణరావు, నోబుల్ రెడ్డి, కందుల కృష్ణ, మంచిన పూర్ణ, కంచర్ల హనుమంతరావు, ఎలికా వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

## ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు

ముసునూరు, మార్చి 28: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఫ్లయింగ్ స్క్వాడ్ శ్రీనివాస్ హెచ్చరించారు. గురువారం సూరేపల్లిలో ఫ్లయింగ్ టీమ్ పర్యటిస్తున్న నేపథ్యంలో ఓ ఇంటికి రాజకీయపార్టీ స్టిక్కర్, మరో ఇంటిపై జెండా ఉండడం గమనించి వాటిని తొలగించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్‌ను గ్రామస్థాయి అధికారులు సమర్థవంతంగా అమలు చేయాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు.

## 'ఏపీలో మోదీ డబుల్ ఇంజన్ పాలన సాగదు'

చాట్రాయి, మార్చి 28: ఆంధ్రప్రదేశ్‌లో మోదీ డబుల్ ఇంజన్ పాలన సాగదని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.హరనాథ్ విమర్శించారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఉత్తరాదిన బీజేపీ హవా తగ్గిపోవడంతో దక్షిణాదిలో పూడ్చుకునే ప్రయత్నం చేస్తున్నారని, కానీ వారి ప్రయత్నాలు ఫలించవన్నారు. భారతదేశ లౌకిక స్ఫూర్తికి విరుద్ధంగా మోదీ పాలన సాగిస్తుండడం ఆందోళకరమన్నారు. కాంగ్రెస్‌తో కలిసి రాష్ట్రాన్ని ముక్కలు చేయడమే కాక ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయని బీజేపీతో జతకట్టిన టీడీపీ జనసేన రాష్ట్ర హక్కులపై ఏవిధంగా పోరాడతారని ప్రశ్నించారు.

## చెన్నారావు కుటుంబ సభ్యులకు టీడీపీ నేతల పరామర్శ



చెన్నారావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న టీడీపీ నాయకులు

చాట్రాయి, మార్చి 28: చీపురుగూడెంలో ఇటీవల మృతి చెందిన టీడీపీ నాయకుడు చీకటి చెన్నారావు కుటుంబసభ్యులను గురువారం టీడీపీ నాయకులు పరామర్శించారు. చింతలపూడి నియోజకవర్గ టీడీపీ మాజీ ఇన్‌చార్జి జగ్గవరపు ముత్తారెడ్డి, మండల నాయకులు అట్లూరి శ్రీనివాసరావు, వెల్ది నాగేశ్వరరావు, మందలపు జగదీష్, పాపోతు రాంబాబు, శేఖర్ తదితరులు పరామర్శించారు. టీడీపీ నాయకులు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమించే చెన్నారావు ఆకస్మికంగా మృతి చెందడం తీరనిలోటని అన్నారు.